RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 186 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి సోమవారం 6-7-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥షష్ఠి ఉ॥9.38, పూ.భా. మ॥12.55, వర్జ్యం రా॥10.28 - 12.03,
దుర్ముహూర్తం మ॥12.29-1.21, శుభ సమయం మ॥1.30-3.00, రాహుకాలం ఉ॥7.30-9.00, సూర్యోదయం ఉ॥ 5.31, సూర్యాస్తమయం సా॥ 6.34 గం॥

## ఏలూరు జిల్లాలో విషాదం

### - రైలు ఢీకొని నలుగురి మృతి



**ఉంగుటూరు, జులై 5:** ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొని నలుగురు మృతి చెందారు. వారిలో ఒక పురుషుడు, ముగ్గురు మహిళలు ఉన్నారు. చర్లపల్లి నుంచి షాలిమార్ వెళ్తున్న ప్రత్యేక రైలు వీరిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమవడంతో గుర్తు పట్టలేని విధంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని, ఒకే కుటుంబానికి చెందిన వారై ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుల వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. ఓ మహిళా మృతదేహం వద్ద లభించిన ఏటీఎం కార్డుపై షేక్ హసీనా అని ఉంది. మరో మహిళ వద్ద తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోలో బైక్ పార్క్ చేసిన రసీదు గుర్తించారు. ఘటనా స్థలిలో రెండు ఫోన్లు లభించినప్పటికీ అవి ధ్వంసమయ్యాయి. వాటి సిమ్‌కార్డులు వేరే చరవాణిలో వేసి మృతులు ఎవరనేది ఆరా తీస్తున్నారు. మృతదేహాలను తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై అప్పారావు తెలిపారు.

## పీవోకేలో ఆందోళనలు ఉద్ధృతం

### -కాల్పులు జరిపిన పాక్ రేంజర్లు



**కశ్మీర్, జులై 5:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనకారులు ఆదివారం చేపట్టిన ఆందోళనపై భద్రతా బలగాలు విరుచుకుపడ్డాయి. నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, 14 మంది గాయపడినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో ఈ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా పీవోకేలోని ముజఫరాబాద్, దద్యాల్‌లో నిరసనకారులు రోడ్లెక్కారు. దద్యాల్-మీర్పూర్ వంతెనపై భారీగా నిరసనకారులు చేరుకోవడంతో పాక్ రేంజర్లు కాల్పులకు దిగారు. ఏకే 47 తుపాకులతో కాల్పులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. నిరసనకారులను చెదరగొట్టడానికి పీవోకే పోలీసులు టియర్‌గ్యాస్, షెల్స్ ప్రయోగించారు. ఇక ముజఫరాబాద్‌లోనూ ఆందోళనకారులపై పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. ఎంతమంది గాయపడ్డారనే విషయం తెలియలేదు. ఈ ఘటనలకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. గత కొన్నిరోజులుగా పీవోకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నిరసనలకు మద్దతు ఇస్తున్న జేఏఏసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. జేఏఏసీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీవోకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది. ఈ నేపథ్యంలో సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని కోరుతూ నిరసనకారులు రోడ్లపైకి వచ్చారు.

# పారిశ్రామికీకరణ వేగవంతం

### -కుప్పం అభివృద్ధికి పెద్దపీట: మీడియాతో సీఎం చంద్రబాబు నాయుడు చిట్‌చాట్

**కుప్పం, జూలై 5 (నేటిమనదేశమ్ ప్రతినిధి):** అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని, కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పం పర్యటనలో భాగంగా మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన పలు కీలక అంశాలపై మాట్లాడారు. కుప్పం నియోజకవర్గానికి గతంలో ఎన్నడూ రానంత స్థాయిలో పారిశ్రామిక ప్రాజెక్టులు వస్తున్నాయని, రోడ్లు, కమ్యూనికేషన్‌తో పాటు అన్ని రంగాల్లో కనెక్టివిటీని పెంచుతున్నామని చెప్పారు. అభివృద్ధి చెందిన కుప్పాన్ని ప్రజలు త్వరలో చూడబోతున్నారని, ఇదే తరహాలో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యమని, అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో క్వాంటం టెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇంధన రంగంలో సౌర, పవన విద్యుత్‌తో పాటు ఆధునిక విద్యుత్ సరఫరా విధానాలను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఆర్సెలార్ మిట్టల్,



జేఎస్‌డబ్ల్యూ వంటి ప్రముఖ స్టీల్ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని, పరిశ్రమల అభివృద్ధితో పాటు పచ్చదన పరిరక్షణకూ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో కంపెనీలకు భూములు కేటాయించిన విధానం వల్ల అనేక వివాదాలు తలెత్తాయని విమర్శించారు. ఓబుళాపురం, ఆన్‌రాక్ వంటి ప్రాజెక్టులు కూడా ఇలాంటి సమస్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నాయని పేర్కొన్నారు.సంక్షేమం, అభివృద్ధితో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే కొందరు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని, పరిశ్రమలను తరిమేయడం, పెట్టుబడిదారులను నిరుత్సాహపరచడమే గత పాలకుల విధానమని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి ప్రాజెక్టును తమదేనని చెప్పుకోవడం, అసత్య ప్రచారం చేయడం ప్రతిపక్ష నాయకుల అలవాటుగా మారిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను గత ప్రభుత్వం గంజాయి సాగుకు కేంద్రాలుగా మార్చిందని ఆరోపించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా "డ్రగ్ ఫ్రీ ఇండియా" కార్యక్రమాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. తిరుమల ప్రసాదం కల్తీ ఘటనను ప్రస్తావిస్తూ, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారే ఇప్పుడు నీతులు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు సామాజిక మాధ్యమాలకు నిధులు అందిస్తున్నారని, తనపై మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. హింస, బూతులు, ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించడం కొందరి రాజకీయ సంస్కృతిగా మారిందన్నారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం వరకు నీటిని తీసుకొచ్చామని, త్వరలో గాలేరు-నగరి ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రాయలసీమ సాగునీటి అవసరాలను మరింతగా తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

## పర్యావరణ నియంత్రిత పౌల్ట్రీ ఫారం ప్రారంభం



**కుప్పం, జూలై 5 (నేటిమనదేశమ్ ప్రతినిధి):** పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధునిక పర్యావరణ నియంత్రిత (ఎన్విరాన్‌మెంటల్ కంట్రోల్డ్) పౌల్ట్రీ ఫారంను ప్రారంభించారు. అనంతరం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన పౌల్ట్రీ షెడ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడి, ఫారంలో అమలు చేస్తున్న ఆధునిక విధానాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉష్ణోగ్రత, తేమ, గాలి ప్రసరణ, వెలుతురు వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నియంత్రించి, కోళ్ల పెంపకానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నట్లు రైతులు వివరించారు.

## మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

### - మంత్రి అచ్చెన్నాయుడు

**విశాఖపట్నం, జులై 5:** విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు యజమాని సమాచారం అందించిన వెంటనే కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మత్స్యశాఖలను అప్రమత్తం చేశామని చెప్పారు. ప్రతికూల వాతావరణం మధ్య కూడా గాలింపు ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక, హెలికాప్టర్లను రంగంలోకి దింపినట్లు మంత్రి తెలిపారు. మర్చంట్ షిప్ ద్వారా ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించామని తెలిపారు. మిగిలిన ఆరుగురి కోసం గాలిస్తున్నామన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్, ఐజీ మెరైన్ పోలీస్, కోస్ట్ గార్డ్ అధికారులు సహాయక చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడినీ సురక్షితంగా తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

**మరో ఘటనలో 10 మంది మత్స్యకారులు సురక్షితం**

మరో ఘటనలో ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖకు చెందిన బోటు సిబ్బందిని రక్షించామని అచ్చెన్నాయుడు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ



అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేశామన్నారు. ఒడిశా మెరైన్ పోలీస్ సకాలంలో స్పందించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను రక్షించారని వివరించారు. మత్స్యకారులందరూ క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు త్వరితగతిన స్పందించారంటూ మంత్రి వారికి ధన్యవాదాలు తెలిపారు. మత్స్యకారులను స్వస్థలానికి చేర్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు.

## హాంకాంగ్‌లో చిక్కుకున్న తెలుగు కుటుంబం

### - స్పందించిన లోకేశ్



**అమరావతి, జులై 5:** హాంకాంగ్ విమానాశ్రయంలో తెలుగు కుటుంబం చిక్కుకోవడంపై మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ నుంచి షికాగో వెళ్తూ పాస్‌పోర్టులు పోగొట్టుకొని బొల్లా రాజేశ్వరి కుటుంబం హాంకాంగ్‌లో చిక్కుకుంది. పిల్లలతో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై లోకేశ్‌కు రాజేశ్వరి కుటుంబ సభ్యులు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 52 గంటలుగా చిన్న పిల్లలతో సాయం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబ పరిస్థితిపై వెంటనే మంత్రి స్పందించారు. బాధితులకు తక్షణ సాయం అందించాల్సిందిగా విదేశాంగ మంత్రి జైశంకర్‌ను లోకేశ్ కోరారు. మంత్రి లోకేశ్ చొరవతో విదేశాంగశాఖ స్పందించింది. హాంకాంగ్‌లోని భారత కాన్సులేట్ జనరల్‌ను సంప్రదించింది. సదరు కుటుంబంతో సంప్రదింపుల్లో ఉన్నామని భారత రాయబారి కార్యాలయం తెలిపింది. వీలైనంత త్వరగా సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించింది. వేగంగా స్పందించినందుకు భారత రాయబారి కార్యాలయానికి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

### -ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**విశాఖపట్నం, జులై 5:** ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో వాయుగుండం కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఒడిశాలోని బాలాసోర్‌కు 40 కి.మీ., చాంద్‌బలికి 50 కి.మీ., పశ్చిమ బెంగాల్‌లోని దిఘాకు 70 కి.మీ. దూరంలో ఉందని తెలిపారు. పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ రాబోయే 12 గంటల్లో చాంద్‌బలి-దిఘా మధ్య బాలాసోర్ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత 24 గంటల్లో అది ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదిలే వీలుందని తెలిపారు. దీని ప్రభావంతో సోమవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,



మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. తీరం వెంబడి గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని సూచించారు.

థాంక్యూ భారత్.. కోలుకుంటున్న వెనెజువెలా 2లో

ఖమేనీ అంత్యక్రియల్లో ముగ్గురు కుమారులు.. కనిపించని మొజ్తబా 2లో

భాజపా కంచుకోట నుంచి ఎన్నికల బరిలో ప్రశాంత్ కిశోర్ 2లో

## పాక్ రక్షణ మంత్రికి మతి భ్రమించింది!

### -భారత్ స్ట్రాంగ్ కౌంటర్



**దిల్లీ,జులై 5:** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆయనకు మతి స్థిమితం లేదని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించింది. ఇటీవల ద్వీపదేశం సీషెల్స్‌లో పర్యటించిన ప్రధాని మోదీ.. ఆ దేశ అత్యున్నత ' గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఖవాజా ఆసిఫ్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అది రూపొందించుకున్న గౌరవం (కావాలని ఇప్పించుకున్న అవార్డు) అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఆయనకు పనేం లేదని, అవగాహనలేని అంశాలపై అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని వ్యాఖ్యానించింది. మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కౌంటర్ ఇచ్చారు. ఇతరులపై అసూయ ఎప్పటికీ మంచి చేయదని, చెడును ప్రేరేపిస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్వేషపూరిత ప్రసంగాలకు అలవాటు పడినవారిలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు.

## ముంబయి అతలాకుతలం..!

### -ముకేశ్ అంబానీ కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

**ముంబయి,జులై 5:** భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఇంకా వర్షం కురిసే అవకాశం ఉండటంతో వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అక్కడి ప్రజలను కోరింది. గడిచిన 24 గంటల్లో పలు చోట్ల 20 సెం.మీ వర్షపాతం నమోదు కాగా.. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో 30 సెం.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు ముంబయిలోని కొన్ని ప్రాంతాల్లో మెట్రో, ప్రజా రవాణా సేవలు యథాతథంగా కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే, మెట్రో సేవల్లో అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. వర్షం కారణంగా ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 1916కి ఫోన్ చేసి చెప్పాలని బీఎంసీ అధికారులు సూచించారు. సముద్ర తీరప్రాంతంలో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగసిపడే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని



కోరారు. థానే, పాల్ఘర్, నవీ ముంబయి, పుణె ప్రాంతాల్లో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. మరికొన్ని చోట్ల రహదారులు నీట మునిగిపోయాయి. జలదిగ్బంధంలో చిక్కుకున్న వారిని అధికారులు, సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. విక్రోలిలో అత్యధికంగా 31.06 వర్షపాతం నమోదైంది.

**ముకేశ్ అంబానీ కాన్వాయ్ ఎదుట కూలిన వృక్షం**

ప్రముఖ వ్యాపార వేత్త ముకేశ్ అంబానీ భద్రతా కాన్వాయ్‌కి ప్రమాదం తప్పింది. పశ్చిమ శివారులోని బంద్రా ప్రాంతంలో ఓ భారీ వృక్షం కాన్వాయ్ ఎదుట కూలిపోయింది. దీంతో కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులు చెట్టును తొలగించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## హార్మూజ్‌లో సేవా రుసుం..!

### - మిత్ర దేశాలకు స్పెషల్ ట్రీట్‌మెంట్: ఇరాన్

**ఇరాన్, జులై 5:** ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో కొత్త టోల్ విధానాన్ని అమలు చేయడానికి ఇరాన్ చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో చైనాలోని ఇరాన్ రాయబారి అబ్దుల్ రెజా రహ్మానీ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్ తమ ప్రాదేశిక జలాల్లో భాగంగా ఉన్నందున.. జలసంధిలో సేవా రుసుం వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఇవి టోల్ కిందకు రావన్నారు. ఈ విషయంపై ఒమన్‌తో చర్చలు జరుపుతున్నామన్నారు. కష్టసమయంలో తమకు సహకారం అందించిన మిత్ర దేశాలకు సేవా రుసుం విషయంలో ప్రత్యేక ప్రాధాన్యాన్ని కల్పించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హార్మూజ్‌లో ప్రయాణ భద్రతకు హామీ ఇవ్వడం, నౌకల రాకపోకలను పర్యవేక్షించడం, భారీ సంఖ్యలో నౌకల వల్ల కలిగే పర్యావరణ పరిణామాలను ఎదుర్కోవడం వంటివాటిని ఒమన్ సహకారంతో ఇకపై తాము పర్యవేక్షిస్తామని అబ్దుల్ రెజా వెల్లడించారు. కాగా హార్మూజ్‌లో విధించే సేవా రుసుంపై మిత్రదేశాలకు ప్రత్యేక రాయితీలు, మినహాయింపులు ఇవ్వాలని టెహ్రాన్ యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



**హార్మూజ్ రంగస్థలం కాదు..**

హార్మూజ్ భద్రతను ఇకపై ఒమన్‌తో కలసి తాము చూసుకుంటామని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాది పేర్కొన్నారు. ఇతర దేశాలు సైనిక విన్యాసాలు చేపట్టడానికి ఈ జలసంధి రంగస్థలం కాదని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ నిర్దేశించిన మార్గంలో కాకుండా.. ఒమన్ తీరం వెంబడి ప్రయాణించడానికి ప్రయత్నించిన ఎనిమిది నౌకలను అక్కడి అధికారులు వెనక్కి పంపినట్లు షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలే సహకరించాలి!

సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్, విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్థ ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఏ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే. ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్ పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కొక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు. ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాల్లో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలో పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారి ఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ ద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయ పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక ప్రక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుతో పాటు అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనాలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుగా వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరి ఆచూకీ లభ్యం



**విశాఖపట్నం, జులై 5:**: విశాఖ చేపల రేవు నుంచి వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరి ఆచూకీ మాత్రమే లభ్యమైంది. గల్లంతైన వారిలో బోటు యజమాని కారె చిన్నయ్యను వాణిజ్య నౌక సిబ్బంది కాపాడారు. మరో ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన చిన్నా, గరగయ్య, అప్పలరాజు, కారె చిన్నయ్య, సీతోడు, విశాఖ జిల్లా భీమిలి మండలం పెదనాగమయ్యపాలేనికి చెందిన బండియ్య, విశాఖకు చెందిన చిన్న అమ్మోరు.. ఈనెల 1వ తేదీన విశాఖ చేపలరేవు నుంచి బోటులో చేపల వేటకు వెళ్లారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు వారికి ఫోన్ చేసి తెలపగా.. 4వ తేదీ మధ్యాహ్నానికి తీరానికి వచ్చేస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారికి ఫోన్లు చేయగా ఏవీ పనిచేయలేదు. దీంతో తమవారికి ఏమైందోనని తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. దీంతో రంగంలోకి దిగిన సహాయక బృందాలు గాలింపు చేపట్టి కారె చిన్నయ్యను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. మిగిలిన వారి కోసం గాలింపు కొనసాగుతోంది. సహచర మత్స్యకారుల గల్లంతుపై బోటు యజమాని కారె చిన్నయ్య మీడియాతో మాట్లాడారు. "శనివారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత బోటును హార్బర్ వైపు తిప్పాం. కెరటాల ఉద్ధృతికి బోటు తిరగబడింది. రాత్రి 9 వరకు బోటు పట్టుకుని ఉన్నాం. ఆ తర్వాత బోటు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. దగ్గరున్న షిప్ దగ్గరకు వెళ్లేందుకు యత్నించాం. నేను షిప్ ఎక్కాను.. మిగతావారు ఎక్కలేకపోయారు. మా బోటు ఆపరేటర్ అసోసియేషన్‌కు సమాచారం ఇచ్చాం" అని తెలిపారు.

**చంద్రబాబు, పవన్ ఆరా**

మత్స్య కారుల గల్లంతుపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జాలర్లను కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. నేవీ హెలికాప్టర్ల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ విస్తృతం చేశామని తెలిపారు. కోస్టుగార్డు నౌకలతో గాలింపు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. గాలింపు చర్యలను సమన్వయం చేసుకోవాలని మెరైన్ ఐజీ, విశాఖ సీపీలకు సూచించారు. గాలింపు చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు.

# భారత గృహిణికి రూ.65 కోట్ల జాక్‌పాట్

**అభిదాబీ, జులై 5:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్ రాజధాని అబూధాబీలో పతి నెల నిరహిచే 'బిగ్ టికెట్'లో ఓ భారత మహిళను అదృష్టం వరించిది. దిల్లీకి చెందిన కనికా అరోడా (42) అనే గహిణికి రూ.65 క్లోట జాక్‌పాట్ తగిలింది. గెలుపొదిన విషయ తెలియగానే తొలుత నమ్మశకగా అనిపిచలేదని కనికా పేర్కొనారు. గత మూడేళ్లుగా తన భర్తతో లక్కీ డ్రాలో పాల్గొటున్నామని.. ఈసారి తన పేరు మీద టికెట్ కొనుగోలు చేశామని కనికా వెలడిచారు. వీటి గురిచి మొదట్లో సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని, పాల్గొటున్నామని చెపారు. డ్రాలో వచ్చిన డబ్బులో కొంత మొత్తంతో ఓ ఇల్లు కొనుగోలు చేస్తామన్నారు.

# మీ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటా..!

## - విజయోత్సవ సభలో మంత్రి పయ్యావుల కేశవ్



**అనంతపురం, జులై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం బూదిగుమ్మ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" పేరుతో విజయోత్సవ సభ నిర్వహించగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కూటమినేతలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. అంతకుముందు ఉరవకొండ నియోజవర్గంలోని బెలుగుప్ప మండలం బూదిగుమ్మ రామసాగరం వద్ద 91 కోట్లు రూపాయలతో 18 కిలోమీటర్ రోడ్డు మరియు నూతన బ్రిడ్జి నిర్మాణానికి మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఒక పక్క నీళ్లు, రెండో పక్క నీళ్లు... అడవిలో సమావేశం ఏర్పాటు చేశామని, మీటింగ్‌కి వచ్చామా, పిక్నిక్‌కి వచ్చామా అన్నట్లుందన్నారు. వారం రోజుల లోపల ఇక్కడికి వచ్చేందుకు దారి వేసి, ఈ మీటింగ్ ఇక్కడ పెట్టామని, రెండేళ్ల నమ్మకంలో ఇదొక భాగం అన్నారు. డ్యామ్‌లో మునిగిపోయిన తర్వాత, ఈ ప్రాంతం వాళ్లు ఎప్పుడు వచ్చినా కూడా అడుగుతూ ఉంటే, ఈ బ్రిడ్జిని శాంక్షన్ చేయడానికి చాలా కష్టపడి చేశామని, కొత్త విధానంతో బ్రిడ్జి వేయబోతున్నారని, నీళ్లలో బ్రిడ్జి పని చేయాలని, ఎక్విప్‌మెంట్ బాంబే నుంచి తెప్పిస్తున్నారని, నీళ్లలో పని చేసేటటువంటి దాంతో గుంతలు కొట్టి, అక్కడ నుంచి పిల్లర్లు ఏర్పాటు కష్టమైన పని అని, సంవత్సరం లోపల ఈ బ్రిడ్జిని పూర్తి ఖచ్చితంగా చేస్తామన్నారు."ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అనేది జరుగుతోందని, దీంట్లో మనం ఓటు లేకపోతే పర్మనెంట్‌గా మనం ఓటు పోయినట్లే దయచేసి గుర్తుపెట్టుకోండన్నారు. ఓటు అనేటువంటిది మనం ఇప్పుడు రిజిస్టర్ చేసుకోలేకపోతే శాశ్వతంగా కోల్పోతాం అని, దయచేసి మీరు శ్రద్ధ పెట్టండన్నారు. 14 చివరి తేదీ అని, 10, 11 రోజులు సమయం ఉందని, ఈ 10 రోజుల లోపల్నే ప్రతి ఓటుని కూడా మనం నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి నాయకుడు వాళ్ళ ఇంట్లో ఉండేటువంటి కుటుంబ సభ్యులు, మిత్రులందరివి కూడా ఓట్లను తీసుకుని వచ్చి చేర్పించేటువంటి బాధ్యత తీసుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు గారి జోడిని చూసి ఇవాళ చిచ్చు పెట్టేటువంటి ప్రయత్నం చేస్తున్నారని, కులాల పేరుతో చిచ్చు పెడుతున్నారు, ప్రాంతాల పేరుతో చిచ్చు పెడుతున్నారని, వీళ్ళ కూటమిని ఎట్లైనా విభజించాలి అనేటువంటి ప్రయత్నం చేశారని, ప్రతి ఒక్కరం కూడా అప్రమత్తంగా ఉండాల్సినటువంటి పరిస్థితి ఉందన్నారు. కూటమి వన్స్ అగైన్ అండ్ అగైన్ అండ్ అగైన్ కూటమి అని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఈ రోజు చూపించినటువంటి ఆదరాభిమానాలకు, గత 30 సంవత్సరాలుగా మీలో ఒకడిగా మీ వాడిగా భావిస్తూ మీరు చూపిస్తున్నటు వంటి అభిమానానికి నేను ఎప్పుడూ శిరస్సు వంచి నమస్కరిస్తూ, మీ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటానన్నారు. అనంతపురం కన్నా కౌకుంట్లలో కూర్చొని అందరికీ తాను అందుబాటులో ఉండి నిరంతరం పనిచేస్తున్నానన్నారు. ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయి, ఒక్క రెవెన్యూ సమస్యలు తప్ప మిగిలినవన్నీ చేయగలుగుతున్నామన్నారు. క్వాలిటీ అఫ్ లైఫ్ పెరగాలని,, నాలుగు రోడ్లు, నాలుగు బిల్డింగులు వేస్తే కాదు.. ప్రతి రంగంలోనూ కూడా మార్పు రావాలని, ప్రతి జీవితంలోనూ కూడా మార్పు రావాలనే దానికోసం.. మీ పయ్యావుల కేశవ్ పని చేస్తూనే ఉంటాడని తెలియజేస్తున్నానన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో రోడ్లేసే బాధ్యత, నీళ్లిచ్చే బాధ్యత, కరెంట్ ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటానని, ప్రజల మనసులకి రోడ్లేసేటువంటి మార్గాన్ని నాయకులు మీరు చూసుకోండి అని చెప్తా ఉంటానన్నారు. ఉరవకొండ నియోజకవర్గం ప్రజలను నేను ఎప్పటికీ కూడా మర్చిపోనని, మొన్న భారత రాష్ట్రపతి గారు వస్తే, ఆమె పక్కన కూర్చునేటువంటి సీటు, అదృష్టం కల్పించింది సీఎం చంద్రబాబు నాయుడు గారు, ఉరవకొండ ప్రజలు అనేటువంటిది నేను ఎప్పటికీ మర్చిపోనన్నారు. రెండేళ్ల క్రితం ఎన్నికలు జరిగితే అద్భుతమైన మెజారిటీని అందించి గెలిపించినటువంటి ప్రజలు మన మీద నమ్మకం పెట్టుకున్నారని, అభివృద్ధి అనంటే ప్రతి కుటుంబంలోనూ మార్పు రావాలని, అదే నిజమైనటువంటి అభివృద్ధి అన్నారు. రైతు జీవితంలో మార్పు రావాలని, ఆ రైతు పొలానికి నీళ్లు రావాలని, పంటలకి ఆదాయం వచ్చే మార్గం రావాలన్నారు.

# థాంక్యూ భారత్.. కోలుకుంటున్న వెనెజువెలా



**వెనెజువెలా, జులై 5:** ఇటీవల సంభవించిన జంట భూకంపాలతో కకావికలమైన వెనెజువెలా ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మహా ప్రళయం మిగిల్చిన విషాదం నుంచి తేరుకుంటోంది. తమకు ఆపన్న హస్తం అందించిన భారత్‌కు అక్కడి ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు. భారత్ సాయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. జూన్ 24న సంభవించిన జంట భూకంపాలతో వెనెజువెలా చిగురుటాకులా వణికిపోయిన సంగతి తెలిసిందే. దాదాపు 2,900 మందికి పైగా మృత్యువాత పడగా.. వేలాది మంది క్షతగాత్రులయ్యారు. భూకంప బాధితులకు మానవతా సాయం అందించేందుకు భారత్ 'ఆపరేషన్ అమిస్తాద్' చేపట్టింది. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలను తీసుకెళ్లి సేవలందించింది. తాజాగా అక్కడి భారత్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఫొటోలు, వీడియోలను విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఘోర ప్రకృతి విపత్తు నుంచి ప్రాణాలతో బయటపడినవారు, వారి కుటుంబ సభ్యులు భారత్ సాయానికి కృతజ్ఞతలు చెబుతున్నారు. కఠిన పరిస్థితుల్లో భారత్ వైద్య సిబ్బంది అద్భుత సేవలు అందించారని కొనియాడుతున్నారు. " భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు. కష్టకాలంలో మమ్మల్ని ఆదుకున్నారు. మీ మేలు మర్చిపోలేం" అంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. ఆపరేషన్ అమిస్తాద్‌లో భాగంగా కరాకస్‌లో ఇండియన్ ఆర్మీ ఫీల్డ్ ఆస్పత్రి ఏర్పాటు చేసి.. రోజంతా వైద్య సేవలు అందిస్తోంది." వెనెజువెలా కష్టకాలంలో ఉన్నప్పుడు భారత సైనిక ఫీల్డ్ ఆస్పత్రి ఆశాదీపంగా నిలుస్తూ, అక్కడి ప్రజల నమ్మకాన్ని పొందింది. మానవతా సాయం, విపత్తు నిర్వహణపట్ల భారత్ నిబద్ధతను ఈ మిషన్ ప్రతిబింబిస్తోంది. ఈ విపత్కర సమయంలో వెనెజువెలా ప్రజలకు అండగా నిలుస్తూ.. వారిని సంరక్షిస్తోంది" అని భారత సైన్యం అదనపు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ (ఏడీజీపీఐ) ఎక్స్‌లో పేర్కొంది.

# ఖమేనీ అంత్యక్రియల్లో ముగ్గురు కుమారులు.. కనిపించని మొజ్తబా



**ఇరాన్,జులై 5:** మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ పార్థివ దేహాన్ని చూసేందుకు లక్షలాదిగా అభిమానులు తరలివస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా సముదాయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. అయితే, ఈ కార్యక్రమంలో ఖమేనీ కుమారుల్లో ముగ్గురు పాల్గొన్నప్పటికీ.. మరో తనయుడు, ప్రస్తుత సుప్రీం లీడర్ మొజ్తబా మాత్రం హాజరుకాలేదని తెలుస్తోంది. ఇరాన్ అధికారిక మీడియా ప్రకారం.. ప్రార్థనల వేళ అలీ ఖమేనీ శవపేటిక వద్ద ముగ్గురు కుమారులు మొస్తఫా, మెయిసమ్, మసౌద్ ఖమేనీలు నిలబడి కనిపించారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘెర్ ఘాలిబఫ్, విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ అహ్మద్ వాహిదీలు కూడా పాల్గొన్నారు. అయితే, సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించకపోవడం, తాజాగా తండ్రి అంత్యక్రియలకు దూరంగా ఉండటంపై చర్చ జరుగుతోంది. వారం క్రితం ఆయన సతీమణి అంత్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. అయితే, భద్రతా కారణాల వల్ల ఆయన హాజరుకావడం లేదని ఇరాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు తెలిసింది. అలీ ఖమేనీకి ఇద్దరు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు ఫిబ్రవరి 28

**నాటి దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారు.**

**అమెరికా ఎన్నటికీ అర్థం చేసుకోదు..**


మరోవైపు, తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల సమయంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ మండిపడింది. ఖమేనీ మరణంతో ఆయన అభిమానులు పడుతున్న వేదనను అమెరికా ఎన్నటికీ అర్థం చేసుకోలేదని పేర్కొంది. వారికి నాగరికత, చరిత్ర లేదని విమర్శించింది. ఈ మేరకు ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సోషల్ మీడియాలో స్పందించింది.

# భాజపా కంచుకోట నుంచి ఎన్నికల బరిలో ప్రశాంత్ కిశోర్



**బిహార్, జులై 5:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలవబోతున్నారు. బిహార్‌లోని బంకీపూర్ స్థానం నుంచి ఆయన పోటీ చేయనున్నారు. ఈ ఉప ఎన్నిక కోసం ప్రశాంత్ కిశోర్‌ను అభ్యర్థిగా నిలబెడుతున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతీ వెల్లడించారు. ఈనెల 30న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఆగస్టు 3న ఫలితాలను ప్రకటించనున్నారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబీన్ ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నితిన్ నబీన్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. భాజపాకు కంచుకోట అయిన ఈ స్థానానికి ఆ పార్టీ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ పార్టీని స్థాపించిన ప్రశాంత్‌కిశోర్ గత ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని ఎదురుచూశారు. తాను పోటీ చేయకపోయినప్పటికీ తన పార్టీ జన్ సురాజ్ తరపున పోటీ చేసిన ఒక్క అభ్యర్థినీ గెలిపించలేకపోయారు. 243 స్థానాలకు గానూ 238 సీట్లలో ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేసినప్పటికీ ఒక్కసీటులోనూ ఆ పార్టీ గెలవలేకపోయింది. దీంతో అప్పట్లో ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనవ్రతం కూడా చేశారు. దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల కోసం మూడు రోజుల క్రితం కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జులై 6న నోటిఫికేషన్ విడుదల కానుంది.

# అయోధ్య వ్యవహారంలో భాజపాపై ఉద్ధవ్ ఠాక్రే ధ్వజం



**ముంబయి, జులై 5:**: అయోధ్య రామ మందిర విరాళాల వ్యవహారంలో శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ ఠాక్రే భారతీయ జనతా పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దోచుకుంటున్నవారే అధికారంలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. ముంబయిలో 'రామ రక్ష' పేరుతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అయోధ్య కేవలం ఒక ట్రైలర్ మాత్రమేనని, కాశీ, మథుర ఇంకా మిగిలే ఉన్నాయని పేర్కొన్నారు. అక్కడ జరగబోయే దోపిడీ గురించి ఆందోళనగా ఉందన్నారు. 'మేం ధైర్యవంతులం. దేశభక్తి కలిగిన హిందువులం. కానీ మూర్ఖులం మాత్రం కాదు' అని ఉద్ధవ్ పేర్కొన్నారు

# ఇ-20 పెట్రోల్‌ను భూటాన్ తిరస్కరించిందా?..

## -స్పందించిన కేంద్రం

భారత్ నుంచి 20 శాతం ఇథనాల్‌ను కలిపిన పెట్రోల్ దిగుమతులను భూటాన్ తిరస్కరించిందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై కేంద్రం స్పందించింది. అవన్నీ వదంతులని స్పష్టం చేసింది. ఇలాంటి అవాస్తవాలను నమ్మొద్దని ప్రజలను కోరింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా స్పందించింది. భూటాన్‌కు ఇ-20 పెట్రోల్‌ను ఎగుమతి చేయడంపై దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదని కేంద్రం స్పష్టం చేసింది. అదేవిధంగా ఆ దేశానికి ఇ-20 పెట్రోల్‌ను ఎగుమతి చేసే అంశం పరిశీలనలో లేదని చెప్పింది. ఇ-20 పెట్రోల్‌ను భూటాన్ నిరాకరించిదంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది.



ఇలాంటివి విశ్వసించొద్దని కోరింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ లేదా చమురు మార్కెటింగ్ కంపెనీలు అధికారికంగా విడుదల చేసే ప్రకటనలనే పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. 207

# స్వాతంత్ర్య వేడుకల వేళ.. న్యూయార్క్‌లో కాల్పుల కలకలం



**న్యూయార్క్, జులై 5:** అమెరికాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. న్యూయార్క్‌లో కాల్పులు కలకలం రేపాయి. బ్రూక్లిన్ సమీపంలోని కోనీ ఐలాండ్‌లో బాణసంచా ప్రదర్శనను తిలకిస్తున్న వేళ అక్కడి సమూహంపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు మైనర్లు సహా ఎనిమిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఓ 21 ఏళ్ల యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు న్యూయార్క్ పోలీసులు వెల్లడించారు. బాధితులను గుర్తించాల్సి ఉందని, ఆ తర్వాతే వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఘటనా స్థలం నుంచి ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు జరుగుతోందన్నారు.

# జైల్లో ఘర్షణ..

## ఇద్దరు ఖైదీల మృతి.. 34 మందికి గాయాలు

**శ్రీలంక, జులై 5:** సినిమా సీన్‌ను తలపించేలా జైల్లో ఉన్న ఖైదీలు పోట్లాడుకున్నారు. రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇద్దరు ఖైదీలు ప్రాణాలు కోల్పోగా.. 34 మంది గాయపడ్డారు. ఈ ఘటన శ్రీలంకలోని నెగోంబో పట్టణంలోని కారాగారంలో చోటు చేసుకుంది. జైల్లో మాదక ద్రవ్యాల వ్యవహారమే ఈ రెండు గ్రూపుల మధ్య ఘర్షణకు దారి తీసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరోవైపు జైలు సామర్థ్యానికి మించి ఖైదీలు ఉన్నారని, ఈ క్రమంలోనే వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుందన్న వార్తలు కూడా వస్తున్నాయి. క్షతగాత్రులను నెగోంబోలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వైపు ఘర్షణ జరుగుతుండగానే.. అక్కడి కొందరు మహిళా ఖైదీలు.. జైల్లో డెంగీ జ్వరాలు వ్యాపిస్తున్నాయంటూ ఆందోళన నిర్వహించారు. దీంతో మరింత ఉద్రిక్తత తలెత్తింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు జైలు అధికారులు అదనపు బలగాలను రంగంలోకి దించారు.

# సీఎం చొరవతో మొదలైన పారిశ్రామిక విప్లవం

## - స్ప్రెరీ గ్రీన్ కంపెనీ భూమి పూజలో పాల్గొన్న కూరపాటి శంకర్ రెడ్డి



**సత్యవేడు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ వల్ల పారిశ్రామిక విప్లవం మొదలైందని సత్యవేడు టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి చెప్పారు. మండల పరిధిలోని చిన్నఈటిపాకం పంచాయతీ, పాలగుంట వద్ద స్ప్రెరీ గ్రీన్ కంపెనీ డైరెక్టర్లు శ్రీయాన్స్ జైన్, రిషబ్ జైన్తో కలిసి స్ప్రెరీ అధునాతన రీసైకిలింగ్, పాలిమర్ తయారీ కంపెనీకి కూరపాటి శంకర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికీకరణలో రాష్ట్రం దూసుకుపోతున్నట్టు గుర్తు చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పారిశ్రామిక పాలసీకి పలువురు పారిశ్రామికవేత్తలు మొగ్గు చూపడం వల్ల పరిశ్రమల స్థాపన వేగవంతమైందన్నారు. తద్వారా చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు, రాష్ట్రానికి సంపద కూడా సృష్టి అవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితమే సత్యవేడు మండలం మాదన పాలెం గ్రామానికి సమీపంలో హీరో కంపెనీ యాజమాన్యం కూడా విడి పరికరాల తయారీ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయగా, మరోపక్క ప్రపంచ స్థాయి ఉపాధి అవకాశాల కోసం శ్రీసిటీలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర మంత్రి లోకేష్ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంతకుమునుపు కూరపాటి శంకర్ రెడ్డి స్థానిక టిడిపి నేతలు కలిసి పాలగుంట వద్దకు చేరుకోగానే స్ప్రెరీ గ్రీన్ కంపెనీ డైరెక్టర్లు శ్రీయాన్స్ జైన్,రిషబ్ జైన్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్ప్రెరీ గ్రీన్ కంపెనీకి టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి,కంపెనీ డైరెక్టర్లు కొబ్బరికాయలు కొట్టి భూమిపూజ చేయడం జరిగింది. కాగా పాలగుంట వద్ద మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.50 కోట్ల పెట్టుబడితో అధునాతన రీసైక్లింగ్, పాలిమర్ తయారీ కంపెనీ నిర్మించనున్నారు. కంపెనీ నిర్మాణం పూర్తయితే దాదాపు 150 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తుందని స్ప్రెరీ గ్రీన్ కంపెనీ డైరెక్టర్ శ్రీయాన్స్ జైన్ పేర్కొన్నారు. ఇదేగాక వివిధ ప్రాంతాల్లో మరో 15 కంపెనీలు నడుస్తున్నట్టు ఆయన చెప్పారు. స్ప్రెరీ ధర్మకోల్ కంపెనీలోను 270 మంది పనిచేస్తున్నారన్నారు. పైగా కొత్తగా నిర్మిస్తున్న స్ప్రెరీ గ్రీన్ కంపెనీలో పర్యావరణాన్ని పరిరక్షించడం, వనరుల సమర్థవంతమైన వినియోగంలో కీలకంగా మారుతుంది అన్నారు.

ఈ కార్యక్రమంలో స్ప్రెరీ ఈపీఎస్ డివిజన్ సీఈవో అనుజ్ గుప్త,జనరల్ మేనేజర్ మనోహర్ రెడ్డి, టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మురళి రెడ్డి, మస్తాన్, టిడిపి మాజీ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, బాలాజీ రెడ్డి, నాగలాపురం వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ జాన్సన్, వైస్ చైర్మన్ మురళి(కోళ్ల చిన్న) చిన్నఈటిపాకం మాజీ సర్పంచ్ గోవిందస్వామి, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వాసు, కృష్ణయ్య యాదవ్, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ జడేరి బాబు, సునీల్ జైన్, శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోవింద స్వామి, కాశీ ప్రతాప్ రెడ్డి, వరదయ్యపాలెం టిడిపి మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి శివయ్య,అమాస్ రెడ్డి, డేవిడ్, తులసి రామ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మాటే ప్రాధాన్యం

## - లబ్దిదారులకు చెక్కులు అందజేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**ధర్మవరం,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని వేగంగా అందించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నానని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఆదివారం ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన మొత్తం 37 మంది లబ్ధిదారులకు రూ.16,00,447 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రమాదాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తుందని మంత్రి పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం అప్పుల పాలవకుండా వారికి ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా, వాటి పరిష్కారానికి వేగంగా స్పందించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని మంత్రి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సలకు దూరమవుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక పెద్ద భరోసాగా నిలుస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గం నుంచి వచ్చే ప్రతి అర్హమైన దరఖాస్తును ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా మంజూరు అయ్యేలా తన కార్యాలయం నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. ప్రజలకు ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం నిజమైన లబ్ధిదారులకు చేరుకోవాలన్నదే తమ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి ప్రభుత్వ సహాయాన్ని అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే వేదికపై మంత్రి సత్యకుమార్ యాదవ్ జనతా వారధి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... జనతా వారధి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నాం. ప్రజల విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, సాధ్యమైనంత వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలకు సేవ చేయడమే మా రాజకీయాల లక్ష్యం. ప్రజల సమస్యలను పరిష్కరించడంలోందుబాటులో ఉంటామన్నారు.

# సౌత్ జోన్ ఉమెన్స్ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ వన్డే టోర్నీకి శ్రీకారం

## - అనంతపురం, కర్నూలు జట్ల ఘన విజయాలు



**వాల్మీకిపురం, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఉమెన్స్ అండర్-19 వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం చిత్తూరు జిల్లా వాయల్పాడు సీడీసీఏ-జీవీఎస్సీఎస్ గ్రౌండ్స్లో ఘనంగా ప్రారంభమైంది. టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి సీడీసీఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి, క్రీడాకారిణులకు క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్ను చిత్తూరు జిల్లా హెడ్ కోచ్ సునీల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. టోర్నీలో భాగంగా గ్రౌండ్--2లో జరిగిన మ్యాచ్లో అనంతపురం జట్టు 92 పరుగుల తేడాతో కడపపై అద్భుత విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 43 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 263 పరుగుల భారీ స్కోరు సాధించింది. జి. గీతిక 125 బంతుల్లో అజేయంగా 128 పరుగులు చేసి సెంచరీతో మెరిసింది. బి. నేహా 96 బంతుల్లో 77 పరుగులతో అర్ధ సెంచరీ సాధించగా, ఎ. హన్సి రెడ్డి 31 బంతుల్లో అజేయంగా 36 పరుగులు చేసింది. కడప బౌలర్లలో పి. శ్రీవల్లి 1/36, డి. చైత్ర 1/49 వికెట్లు తీశారు. 264 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కడప జట్టు నిర్ణీత 43 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 171 పరుగులు మాత్రమే చేయగలిగింది. కె. సహస్ర 92 బంతుల్లో 63 పరుగులు చేయగా, వి. ప్రశంస 84 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేసింది. అనంతపురం బౌలర్లలో బి. తేజస్విని 2/25తో రాణించగా, బి. నందిని 1/27, ఎ. మాన్విత 1/25, ఎ. హన్సి రెడ్డి 1/28 వికెట్లు పడగొట్టారు. దీంతో అనంతపురం జట్టు 92 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మరోవైపు గ్రౌండ్-1లో జరిగిన మ్యాచ్లో కర్నూలు జట్టు నెల్లూరుపై ఏకపక్ష విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 215 పరుగులు చేసింది. ఆ జట్టులో కె. వెంకట సాత్విక రెడ్డి 77 బంతుల్లో 51 పరుగులు, టి. విష్మశ్రీ 66 బంతుల్లో 39 పరుగులు, ఎమ్. మహాలక్ష్మి 18 బంతుల్లో 36 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లలో పి. ప్రవళిక 2/37, వన్షిక 2/35, వై. సుష్మా ఆచారి 1/32 వికెట్లు సాధించారు. 216 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు కేవలం 30.2 ఓవర్లలో వికెట్ కూడా కోల్పోకుండా 217 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఎమ్. సహస్ర రెడ్డి 92 బంతుల్లో అజేయంగా 118 పరుగులతో సెంచరీ నమోదు చేయగా, ఎస్. రజియా సుల్తానా 96 బంతుల్లో అజేయంగా 66 పరుగులు చేసి అర్ధ సెంచరీ సాధించింది. వీరిద్దరూ తొలి వికెట్కు అభేద్యంగా 217 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి జట్టుకు ఘన విజయాన్ని అందించారు.

# సర్ ప్రక్రియలో ప్రతి ఓటర్కి న్యాయం జరగాలి

## - డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, ఎస్.నిసార్ అహమద్

**మదనపల్లె,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్క ఓటర్కి న్యాయం జరగాలని డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, ఎస్. నిసార్ అహమద్లు అన్నారు. ఆదివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ శాసన సభ్యులు డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటైజేషన్, ఓటర్ల ఫిర్యాదులు, క్షేత్రస్థాయి సమస్యలు మరియు పరిష్కార మార్గాలపై చర్చించారు. 100 శాతం ఫారాలు పంపిణీ అయ్యాయని చెబుతున్నారన్న అంశంపై డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ప్రశ్నిస్తూ, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా నాయకులు, బిఎల్ఏలు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. నిసార్ అహమద్ మాట్లాడుతూ, పార్టీ నాయకులు లకు సహకరిస్తూ గ్రామాలు, వార్డుల వారీగా పర్యటించి ప్రతి కుటుంబాన్ని కలవాలని, ఓటర్ల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని కోరారు. డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి, ఎస్ఈసి సభ్యురాలు షమీమ్ అస్లాం, వి ఎస్ రెడ్డి, శ్రీనివాసులు, ప్రసాద్ బాబు గుండ్లూరు రఫీ, వినుతబాయి, సాయిశేఖర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, సురేంద్ర, శారదా రెడ్డి, కరుణాకర్ రెడ్డి, జన్నే శేషాచలపతి, ఎస్ కె ఇర్ఫాన్, ఎన్ నవాజ్ అలీ ఖాన్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, శరత్ రెడ్డి, నాగరాజు రెడ్డి , తట్టి నాగరాజు రెడ్డి, నందినితాజ్, పలువురు నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఎమ్మెల్యేలు ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు

**పలమనేరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డిని ఆయన స్వగృహంలో పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు శాసనసభ్యులు, జనసేన పార్టీ జిల్లా అబ్జర్వర్ ధర్మరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఏర్పాటు చేసిన అల్పాహార విందులో పాల్గొన్న ధర్మరాజు, ఆత్మీయంగా ముచ్చటించారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, జిల్లాలో పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా చేరేలా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, సమన్వయంతో ప్రజాసేవలో ముందుకు సాగాలని వారు అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఎమ్మెల్యే ధర్మరాజు తన అనుచరులతో కలిసి పలమనేరు మండలంలోని ముసలి మడుగులో ఉన్న ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాసులు, జనసేన జిల్లా వైస్ ప్రెసిడెంట్ పూల ప్రభాకర్, జిల్లా సెక్రటరీలు పూల చందుకుమార్, దేవినేని యశ్వంత్, పూల చైతు, కార్పొరేటర్లు పూర్ణ, వెంకటేష్, జనసేన నాయకులు దిలీప్ కుమార్, ఆకుల గజేంద్ర, హరీష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**సత్యవేడు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర హాస్పిటల్ ప్రాంగణంలో మిషన్ ఫర్ విషన్, చెన్నై శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగులనుంచి విశేష స్పందన లభించింది. శ్రీవెంకటేశ్వర ఆస్పత్రి అధినేత డాక్టర్ రాజేంద్రన్ పర్యవేక్షణలో, నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి వంద మంది రోగులు పాల్గొన్నారు. రోగులను చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ అరవింద్, మిషన్ ఫర్ విషన్ కోఆర్డినేటర్ రాము బృందం కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, పలువురికి మందులను పంపిణీ చేశారు. దీంతోపాటు కంటిపొర, దూరపు చూపు తదితర సమస్యలతో బాధపడుతున్న 40 మంది రోగులకు కంటి ఆపరేషన్ చేయడానికి వైద్యులు సిఫార్సు చేశారు. ఇదే గాక కంటి అద్దాలకు సంబంధించి టెక్నీషియన్, రోగులను పరీక్షించి 35 మందికి కంటి అద్దాలకు సిఫార్సు చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు మాదరపాకం కిషోర్ కుమార్ రెడ్డి,పలువురు రోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ



**సూళ్లూరుపేట,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగ 29 మంది లబ్ధిదారులకు రూ.24,49,394 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వాళ్లను ఆర్థికంగా ఆదుకోవడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశమని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.5 కోట్ల 30 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ప్రచార కార్యక్రమం నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్



**ఏర్పేడు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో సర్, రెండు సంవత్సరాల కాలంలో ప్రజల నమ్మకం జరిగిన అభివృద్ధి సంక్షేమం గురించి ఇంటింటికీ వెళ్లి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆ సంబంధించి బూత్ కమిటీ కన్వీనర్లు గ్రామ కమిటీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రెడ్డివారి గురువారెడ్డి ఇళ్ల వద్దకు వెళ్లి పూర్తిచేసినటువంటి గణన ఫారంలను సేకరించడం జరిగింది .అనంతరం ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమం గత మాసం 15వ తారీకు నుండి ప్రారంభమైంది. ఇక మిగిలింది తొమ్మిది రోజులు ఉంది గణన ఫారంలను కలెక్ట్ చేయడం అదేవిధంగా 18 సంవత్సరాల వయసు నిండిన వారికి ఓటు హక్కు కల్పించడం తదితర అంశాల గురించి బియల్ఏ చురుగ్గా పనిచేసే బిఎల్బి వాళ్ళతో కోఆర్డినేట్ చేసుకుని మన ఓట్లను కాపాడుకోవాలని గురవారెడ్డి కోరారు. ఈ నెల 15వ తారీకు నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రజలులేకి తీసుకువెళ్లి ఇంటింటికి వెళ్లి మనం చేస్తున్న అభివృద్ధిని సంక్షేమాన్ని వారికి వివరిస్తూ ప్రభుత్వం ద్వారా వారికి ఏవైతే పథకాలు వచ్చాయో వాటిని అంతా మన పార్టీ నాయకత్వం వివరించాల్సిన అవసరం ఉందని విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాం అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డితో పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాదమునిశెట్టి, బూత్ కమిటీ కన్వీనర్లు శంకర్ రెడ్డి, మునికృష్ణ, పార్టీ నాయకులు మాధవరెడ్డి, ముని కృష్ణారెడ్డి సురేంద్ర రాజు, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఆర్డీవో



**నాయుడుపేట, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, (సర్) కార్యక్రమాన్ని బూత్ లెవెల్ ఆఫీసర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంగా పనిచేసి విజయవంతం చేయాలని సూళ్లూరుపేట ఆర్డీవో దేవేందర్ రెడ్డి తెలియజేశారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బూత్ లెవెల్ ఆఫీసర్స్,బూత్ లెవెల్ ఏజెంట్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్ ) లో ఓటర్లు మాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ చివరి రోజు అయినందున ప్రతి ఒక్క ఓటరు దగ్గర నుండి ఏనుమరేషన్ ఫారంలు తీసుకోవాలని తెలిపారు. బిఎల్ఓ, బిఎల్ఏ సమన్వయంతో పనిచేసి ఈనెల 15వ తేదీ నాటికి సర్ కార్యక్రమాన్ని పూర్తి చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులల్లా, పలువురు బిఎల్ఓలు, బి ఎల్ఏలు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధికి, సహకార సంఘాల కృషి

## - పిఎసిఎస్ చైర్మన్ చేకూరు జనార్ధన్ చౌదరి

**రామచంద్రాపురం,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశానికి వెన్నెముకలైన రైతుల అభివృద్ధికి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు పూర్తి సహకారాన్ని అందిస్తాయని రామచంద్రాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ చేకూరి జనార్దన్ చౌదరి అన్నారు. ఆదివారం సింగల్ విండో కార్యాలయ ఆవరణంలో సహకారంతోనే సమృద్ధి అనే నినాదంతో సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, రైతులకు ఉచిత బీమా సౌకర్యం కూడా ఉందన్నారు. జిల్లా సహకార ఆడిట్ ఆఫీసర్ బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్టర్ నాగభూషణం మాట్లాడుతూ రైతుల అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషెలా సిబ్బంది పని చేయాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఝాన్సీ, సుధాకర్ చంద్ర, సీఈఓ లు భాస్కర్ రెడ్డి, పసపల కన్నయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలొస్తున్నాయ్...!

### - ఇక దళారుల దందాకు చెక్




**చిత్తూరు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులు, దళారుల దందా అరికట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆయా జిల్లాల్లో భూములు, ఇతర ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వెలుపల ఉండే దళారులు చేసే అనధికార మామూళ్ల వసూళ్లతో వినియోగదారులు నష్టపోవడంతో పాటు, ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండి పడుతోంది. వీటిని అధిగమించి, కక్షిదారులకు పారదర్శకత, అవినీతి రహిత సేవలు అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) తీసుకొచ్చే ఆలోచన చేసింది. ఇందుకు సంబంధించి కార్యాచరణ కూడా మొదలైంది.

**ప్రభుత్వానికి ఆదాయ వనరు**

ప్రభుత్వానికి ఆదాయం అందించే శాఖల్లో స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ఆయా జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల పరిధిలో ఏటా వేలాది రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రైవేట్ వ్యక్తులు, దళారుల ప్రమేయం ఎక్కువగా ఉందని ప్రభుత్వం గుర్తించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఎక్కువ కావడానికి సిబ్బంది కొరత కూడా కారణంగా తెలుస్తోంది. దీంతో రిజిస్ట్రేషన్లకు వచ్చే ఆయా ఆస్తుల వాస్తవికత, ప్రభుత్వ విలువ, మార్కెట్ విలువ తదితర అంశాలను ధ్రువీకరించేందుకు వీలుకాకుండా పోతోంది. వాస్తవానికి వివాదాస్పద ఆస్తుల క్రయ, విక్రయాలకు ఆయా సబ్ రిజిస్ట్రార్లు గాని, సబ్ రిజిస్ట్రార్ అనుమతించిన అధికారి గానీ నేరుగా ఆయా ఆస్తుల వద్దకు వెళ్లి తనిఖీ చేయాలి. తమ తనిఖీల్లో సంబంధిత ఆస్తుల వివరాలన్నీ సక్రమంగా ఉంటేనే ఆస్తుల క్రయ,విక్రయాలను చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో వాటిని పెండింగ్ లో పెట్టే అధికారం సంబంధిత రిజిస్ట్రార్లకు ఉంది. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న సిబ్బంది కొరత కారణంగా అలాంటి తనిఖీలు చేస్తున్న దాఖలాలు చేతి వేళ్ళ మీదనే లెక్కించుకోవచ్చు. సిబ్బంది కొరత, సమయాభావాల కారణంగా సబ్ రిజిస్ట్రార్లు సైతం దళారులు, డాక్యుమెంట్ రైటర్లు తయారుచేసిన క్రయ, విక్రయాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించకుండానే మొక్కుబడిగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికే ప్రభుత్వం ఆర్ఎస్‌కే వ్యవస్థను తీసుకొస్తోంది .

**కొత్త వ్యవస్థ పనితీరిలా..**

సరికొత్తగా ఏర్పాటు చేయనున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో పబ్లిక్ డాక్యుమెంట్ సిస్టమ్ ద్వారా దస్తావేజులు తయారు చేస్తారు. చలానా రూపంలో చెల్లింపులకు వీలుంటుంది. రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుక్ చేస్తారు. క్రయ, విక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి కేవైసీ వంటివి పూర్తి చేసుకుంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా పూర్తయ్యే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్య పద్ధతిలో వీటిని నిర్వహించాల్సి ఉంటుంది. భాగస్వామిని ఎంపిక చేసి సిబ్బందిని నియమించే పనిలో సంబంధిత శాఖాధికారులు బిజీగా ఉన్నారు. త్వరలోనే ఈ వ్యవస్థ కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ ప్రారంభమైతే ఒక్కో దస్తావేజు తయారీకి గరిష్టంగా రూ.2 వేలు వరకు వసూలు చేయనున్నారు. అదే క్రమంలో అవినీతి అక్రమాలకు చెక్ పెట్టడంతో పాటు, కక్షిదారులు, అధికారులకు సమయం ఆదాయే అవకాశం ఉంటుంది.



# చిత్తూరు జిల్లా

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం



**పలమనేరు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐఎంఏ పలమనేరు బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ ఎన్‌హెచ్ఆర్ సిసిఎఫ్, హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమానికి వైద్యులు, యువత, స్వచ్ఛంద సేవకులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు విశేషంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉదయం ప్రారంభమైన ఈ రక్తదాన శిబిరంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం విశేషంగా నిలిచిందన్నారు. ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసూతి సమయంలో అధిక రక్తస్రావానికి గురయ్యే మహిళలు, క్యాన్సర్, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రతి యూనిట్ రక్తం ప్రాణాధారంగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమానికి ఐఎంఏ పలమనేరు బ్రాంచ్ అధ్యక్షులు డా.ఇ.యుగంధర్ నాయకత్వం వహించారు. భవిష్యత్తులో కూడా మరింత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఐఎంఏ పలమనేరు బ్రాంచ్ ముందుకు సాగుతోందని డా.ఇ.యుగంధర్ తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి రక్తదాతకు, వైద్యులకు, స్వచ్ఛంద సేవకులకు, సహకరించిన సంస్థలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు సమిష్టి కృషి అవసరం

### - తులసినాథం నాయుడు



**పలమనేరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు అన్నారు. ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరం నాల్గవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా రక్షణకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నింటిలో మాతృభాషా మాధ్యమంలోనే విద్యా బోధన సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలన్నారు. తమిళనాడు తరహాలో భాషా సంస్కృతల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేసినప్పుడే మనగలుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రజనీ బృందం చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరచిన 50 మంది విద్యార్థులకు,100కు పైగా పద్యాలు చెప్పిన 15 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బంగారు పతకాలు, జ్ఞాపికలు, పుస్తకాలు బహుమతులుగా అందించారు. నృత్యం చేసిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, కోశాధికారి పైనేని మురళి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, మాధవరెడ్డి, విమల, నీలిమ, గిరిధర మూర్తి, పురంధర్, నరసింహులు, నవీన్, జయలక్ష్మి, రమ్య, ఇందిర, రాజశేఖర్, తిమ్మప్ప నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి అడ్మిషన్లు

**పలమనేరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పాలిటెక్నిక్ కాలేజీ సమీపం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. 2026-2027 విద్యా సంవత్సరానికి గాను 5 తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాల కోసం వోసిబి1, ఎస్టి బి1, బీసీ-సి-4 ఐదవ తరగతిలో 6 సీట్లు ఖాళీలు ఉన్నాయని, జీతీ. ఎంఈసి నందు ఎస్సీ-18, బిసి-4 ఎస్టి-3, బిసి-1, ఓసి-1 మొత్తం ఖాళీలు జేఆర్. ఎంఈసి నందు 27 ఖాళీలు ఉన్నాయని విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలి సూచించారు.

## ఎమ్మెల్యేతో ఉంగుటూరు ఎమ్మెల్యే భేటీ



**పలమనేరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శాసనసభ్యులు అమర్నాథరెడ్డిని ఆయన స్వగృహంలో పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు శాసనసభ్యులు, జనసేన పార్టీ జిల్లా అబ్జర్వర్ ధర్మరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి ఏర్పాటు చేసిన అల్పాహార విందులో పాల్గొన్న ధర్మరాజు, ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం రాష్ట్ర రాజకీయ పరిణామాలు, జిల్లాలో పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా చేరేలా చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, సమన్వయంతో ప్రజాసేవలో ముందుకు సాగాలని వారు అభిప్రాయపడ్డారు. అంతకుముందు ఎమ్మెల్యే ధర్మరాజు తన అనుచరులతో కలిసి పలమనేరు మండలంలోని ముసలిమడుగులో ఉన్న ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. అక్కడ ఏనుగుల సంరక్షణ, సహజ వాతావరణాన్ని పరిశీలిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాసులు, జనసేన జిల్లా వైస్ ప్రెసిడెంట్ పూల ప్రభాకర్, జిల్లా సెక్రటరీలు పూల చందుకుమార్, దేవినేని యశ్వంత్, పూల చైతు, కార్పొరేటర్లు పూర్ణ, వెంకటేష్, జనసేన నాయకులు దిలీప్ కుమార్, ఆకుల గజేంద్ర, హరీష్, జిల్లేడు అరుణ్, జస్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్‌చే మాతృమూర్తులకు బేబి కిట్ల పంపిణీ



**వి.కోట,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని కమ్యూనిటీ ఆసుపత్రిలోని మాతృమూర్తులకు అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం తన సేవా కార్యక్రమాలను ఉద్ధృతం చేసింది. ఆదివారం ఉదయం స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలోని బాలింతలకు బేబి కిట్లు, అల్పాహారం, పాలు, పళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ బివి తుకారాం మాట్లాడుతూ... మానవసేవ మాధవసేవలకు సమాన ప్రాధాన్యమిస్తూ, శైశవ దశలోనే సేవాభావాన్ని అలవర్చడమే తమ లక్ష్యమని అన్నారు. సెక్రటరీ ఆర్ రమేష్ బాబు మాట్లాడుతూ... ప్రతినెలా 5వ తేదీ ఆరు సంవత్సరాలుగా క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతృమూర్తులకు ఉపయోగపడే వస్తువులు అందిస్తున్నామని, రాబోయే లయనిస్టిక్ సేవా సంవత్సరంలో మరిన్ని వినూత్న సేవా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రెజరర్ హర్ష, వైస్ ప్రెసిడెంట్ ఏఎస్‌పి చౌదరి, హరి, తీర్థంకర్, చంద్రశేఖర్, క్లబ్ అడ్మిన్ పునీత్ కుమార్, జనార్దన్ నాయుడు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ భారత ఫార్మకాలజీ క్విజ్‌లో ప్రతిభకు పట్టం

### - 'ఆర్ఎక్స్ రేస్-2026' విజేతలకు బహుమతులు
### - విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే వేదిక: డా.నితిన్ నాగర్కర్



**చిత్తూరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైద్య విద్యార్థుల్లో ఫార్మకాలజీపై శాస్త్రీయ అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన పెంపొందించే లక్ష్యంతో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్)లో నిర్వహించిన 'ఆర్ఎక్స్ రేస్-2026' దక్షిణ భారత ఫార్మకాలజీ క్విజ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన 51 జట్లు పోటీపడగా, బెంగళూరులోని పీఈఎస్ మెడికల్ కాలేజీ తొలి బహుమతిని కైవసం చేసుకుంది. బెంగళూరులోని పీఈఎస్ మెడికల్ కాలేజీ జట్టు తొలి బహుమతిని, బెంగుళూరులోని ఎంవిజె మెడికల్ కాలేజీ జట్టు ద్వితీయ బహుమతిని, పీఈఎస్ మెడికల్ కాలేజీ మరో జట్టు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నాయి. బహుమతి ప్రదానోత్సవానికి ది అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ (డా.) నితిన్ ఎం. నాగర్కర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మకాలజీ క్లినికల్ మెడిసిన్‌కు పునాదిగా నిలిచే ప్రధాన విభాగమని పేర్కొన్నారు. దక్షిణ భారత స్థాయి పోటీలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, క్లినికల్ ఆలోచనా విధానం, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. మందుల సురక్షిత వినియోగం, వాటి దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన ప్రతి వైద్యునికి అత్యవసరమని సూచించారు. ఫార్మకాలజీ విభాగాధిపతి డా. సచిదానంద అడిగా ఎం.ఎన్. మాట్లాడుతూ, పాఠ్యపుస్తకాలకు అతీతంగా విజ్ఞానాన్ని పెంపొందించడం, క్లినికల్ ఆలోచనా విధానాన్ని పెంపొందించడం లక్ష్యంగా దక్షిణ భారత రాష్ట్రాలకు చెందిన ద్వితీయ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఫార్మకాలజీ పాఠ్యాంశంపై నిర్వహించిన ప్రిలిమినరీ ఎంసీక్యూ పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఆరు జట్లు తుది రౌండ్‌కు అర్హత సాధించాయని, అనంతరం విజేతలను ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్, అసోసియేట్ డీన్ (రిసెర్చ్) డా. ఉషా ఎస్. అడిగ, ఫార్మకాలజీ విభాగాధిపతి డా. సచిదానంద అడిగా ఎం.ఎన్., ప్రొఫెసర్ డా. ఎస్. శివచంద్ర రాజు, నిర్వహణ కమిటీ సభ్యులు డా. మహ్మద్ అబ్రార్, డా. గంధం రవి, డా. భవ్య లేఖ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుప్పంలో పీ4 విజయగాథ

### - 761 పేద కుటుంబాలకు జీవనోపాధి

**కుప్పం, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదరిక నిర్మూలన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్) కార్యక్రమం కుప్పం నియోజకవర్గంలో విజయవంతంగా అమలవుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. 2025 మార్చి 30న ఉగాది సందర్భంగా పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించగా, అదే ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన సర్వేలో కుప్పం నియోజకవర్గంలో 8,904 బంగారు కుటుంబాలను గుర్తించారు. అనంతరం జూన్‌లో ముఖ్యమంత్రి 250 కుటుంబాలను దత్తత తీసుకోగా, ఆగస్టులో మార్గదర్శకులను గుర్తించి, యువ ప్రొఫెషనల్‌ను నియమించారు. అక్టోబర్‌లో ప్రతి మండలానికి స్వచ్ఛంద సంస్థలను కేటాయించి కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. 2026 జూలై నాటికి రూ.5.29 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులను సమీకరించి, 761 కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు కల్పించారు. మిగిలిన కుటుంబాలకు కూడా రాబోయే 6 నుంచి 10 నెలల్లో ప్రయోజనాలు అందించేలా కార్యాచరణ కొనసాగుతోంది. చిత్తూరు జిల్లాలో మొత్తం 67,547 బంగారు కుటుంబాలు గుర్తించగా, వాటిలో 8,904 కుటుంబాలు కుప్పం నియోజకవర్గంలోనే ఉన్నాయి. జిల్లాలో జరిగిన మొత్తం 38,844 దత్తతల్లో కుప్పం వాటా 8,904 (23 శాతం) కావడం విశేషం. పీ4 కార్యక్రమం కింద ఇప్పటివరకు 444 కుటుంబాలకు పాల పశువుల పెంపకం, 155 కుటుంబాలకు గొర్రెలు-మేకల పెంపకం, 48 కుటుంబాలకు కుట్టు, వస్త్ర వ్యాపారం, 53 కుటుంబాలకు రిటైల్ దుకాణాలు, 17 కుటుంబాలకు ఆహార వ్యాపారాల ఏర్పాటు కోసం సహాయం అందించారు. అదనంగా పండ్లు, కూరగాయల వ్యాపారం, వాహన రవాణా, ఇనుము పనులు, చికెన్ సెంటర్లు, కొబ్బరి వ్యాపారం, మెకానిక్ సేవలు తదితర రంగాల్లో కూడా లబ్ధిదారులకు చేయూత అందించారు. ఈ జీవనోపాధి కార్యక్రమాల ద్వారా లబ్ధిదారులు నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు స్థిర ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి దత్తత తీసుకున్న 250 కుటుంబాలతో నేరుగా అనుసంధానం కోసం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌ను కూడా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. పీ4 కార్యక్రమం ద్వారా కుప్పం నియోజకవర్గాన్ని పేదరిక నిర్మూలనలో రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# తోతాపురి మామిడి రైతులకు అండగా ప్రభుత్వం

### - కిలోకు రూ.4 కనీస మద్దతు ధర

**చిత్తూరు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లా తోతాపురి మామిడి రైతులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తోతాపురి మామిడి పండ్లకు కిలోకు రూ.4 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించి రైతులకు భరోసా కల్పించింది. చిత్తూరు జిల్లా దేశంలోనే ప్రముఖ తోతాపురి మామిడి ఉత్పత్తి జిల్లాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. జిల్లాలో సుమారు 51,736 హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు జరుగుతుండగా, సుమారు 5.17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉంది. ఈ రంగంపై సుమారు 35 వేల మంది రైతు కుటుంబాలు ప్రత్యక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.జిల్లాలో పండే తోతాపురి మామిడి ప్రధానంగా పల్ప్ తయారీకి మాత్రమే అనుకూలంగా ఉండటంతో, పల్ప్ పరిశ్రమలే రైతులకు ప్రధాన కొనుగోలుదారులుగా ఉన్నాయి. అయితే గత ఏడాది నుంచి పల్ప్ పరిశ్రమలు కొనుగోళ్లు తగ్గించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిత్తూరు నుంచి ఎగుమతి అయ్యే తోతాపురి మామిడి పల్ప్‌కు ఇరాన్ ప్రధాన మార్కెట్‌గా ఉండేది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, రెడ్ సీ, హోర్ముజ్ జలసంధి మార్గాల్లో రవాణా అంతరాయాలు ఏర్పడటంతో ఇరాన్‌కు ఎగుమతులు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పల్ప్ పరిశ్రమలు కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2025--26 సీజన్‌లో జిల్లాలో తోతాపురి మామిడి అధిక దిగుబడి నమోదవగా, డిమాండ్ తగ్గిపోవడంతో ధరలు భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం పల్ప్ పరిశ్రమల వద్ద కిలోకు రూ.5-6, మండీలలో రూ.4-5, ర్యాంపుల వద్ద రూ.3-4 మాత్రమే ధర లభిస్తోంది. తోతాపురి మామిడికి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో రైతులు తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో ప్రస్తుతం 32 పల్ప్ పరిశ్రమలు ఉండగా, వాటిలో 31 పనిచేస్తున్నాయి. మూడు మండీలు, 52 ర్యాంపుల ద్వారా కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కిలోకు రూ.4 కనీస మద్దతు ధర ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు కనీస ధర హామీ లభించి, ఆర్థిక నష్టాలు తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. జూన్ 29, 2026 నాటికి పల్ప్ పరిశ్రమల ద్వారా 1,58,539.22 మెట్రిక్ టన్నులు, మండీలు మరియు ర్యాంపుల ద్వారా 44,509.44 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 2,03,048.66 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, చిత్తూరు జిల్లా మామిడి రైతులకు అవసరమైన అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**బైరెడ్డిపల్లి, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బైరెడ్డిపల్లి మహాతీ ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు(ఎన్ఆర్ఐ) ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి ఆదివారం ఆనవాయతీగా ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగింది. బైరెడ్డిపల్లి చుట్టుపక్కల గ్రామాలనుంచి అధిక సంఖ్యలో కంటి సమస్య ఉన్నవారు వచ్చి కంటి పరీక్షలు చేసుకున్నారు. ఆపరేషన్‌కి ఎంపికైనవారిని కుప్పం పిఈఎస్ డాక్టర్స్, హాస్పటల్ సిబ్బంది తమ వాహనంలో తీసుకెళ్లారు. మంచి మనసుతో ఎన్నో సంవత్సరాల నుంచి తమ సొంత నిధులతో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి ఎంతో మంది పేద ప్రజలకు మంచి కార్యాలు చేస్తున్న నాగరాజును శిబిరానికి వచ్చిన ప్రజలు ధన్యవాదాలు తెలియజేసారు. కార్యక్రమం అనంతరం శిబిరానికి వచ్చిన వారికి మహాతీ ఫౌండేషన్ ద్వారా భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో పిఈఎస్ డాక్టర్స్, మహాతీ ఫౌండేషన్ సిబ్బంది ఎస్.మునెప్ప, చిన్నప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మార్పుకోసం యువత నడుం బిగించాలి

**- ఆర్‌పిఐ జాతీయ నేత డా ఎం వెంకట స్వామి**



**కడప, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజిక మార్పు కోసం యువత నడుం బిగించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్పీఐ అత్వాలే) జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం వెంకటస్వామి అన్నారు. ఆ పార్టీ దక్షిణ రాష్ట్రాల అధ్య క్షుడు ఎన్‌డి అజయ్ ప్రసన్న ఆధ్వర్యంలో శనివారం బెంగళూరు లోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి వెంకట స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసా హెబ్ అంబేద్కర్ స్థాపించిన "రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) బలోపేతానికి కృషి చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని అన్నారు. స్వాతం త్ర్యం వచ్చి 76 సంవత్సరాలైనా పేద లకు ఎలాంటి న్యాయం జర గలేదని ఆవేదన వ్యక్తంచేశారు. నేటికీ దళితులు, బుడుగు బల హీన వర్గాల ప్రజలు అణచి వేతకు గురౌవుతున్నారని చెప్పారు రాయలసీమ ప్రాంతంలో దళితులు స్వేచ్ఛగా జీవించ లేక పోతు న్నారని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి, దానిని రూపొందించిన భరత మాత ముద్దు బిడ్డ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి తెలుసుకోలేక పోతున్నారని, ఆయన రాజ్యాంగ స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని, దళితుల్లో రాజకీయ చైతన్యం తేవాలని పిలుపుని చ్చారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) రాష్ట్ర స్పోక్స్ పర్సన్ గా కర్నూలు జిల్లా కు చెందిన సీహెచ్ రంగయ్య తోపాటు పలువురికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సమా వేశంలో కడప జిల్లాకు చెందిన ఆపార్టీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర చైర్మన్ జ్యోతి జార్జ్, రాయలసీమ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ దర్శి లక్ష్మి చెన్నకేశవ రావు, జిల్లా నాయకులు ఏకాశి సురేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించాలి: ఏపీ జేఏసీ



**పీలేరు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ జేఏసీ అన్నమయ్య జిల్లా చైర్మన్ యం.వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, శాసన సభ సభ్యులు, పీలేరు వారికి ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల పక్షం వహించాలని, కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు సంబంధించిన బకాయిల చెల్లింపు, వైద్య, ఆరోగ్య శాఖ నందు తొలగించబడిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం, ప్రభుత్వరంగ సంస్థలకు, గురుకుల సొసైటీలకు పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62కు పెంపు, మెమో 57 ప్రకారం 11,000 మందికి సీపీఎస్ నుంచి ఓపిఎస్ అమలు వంటి అంశాలలో సానుకూల నిర్ణయాలు తీసుకోవడమైనది. రాష్ట్ర జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ , రాష్ట్ర సెక్రటరీ జనరల్ ప్రసాద్ మరియు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డి. వి రమణ ఆదేశాల మేరకు ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని, జులై 26వ తేది లోపు ఉద్యోగుల డిమాండ్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసన్, రెడ్డెప్ప నాయుడు, సి బాబు రెడ్డి, వెంకట రమణ రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, నాగేశ్వర్, వెంకట రమణ, మురళి, మనోహర్, శివప్రసాద్, రమేష్ బాబు, బాలకృష్ణ, రెడ్డి వరప్రసాద్, మంజునాథ్, వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

# వింత వ్యాధితో బాధపడుతున్న బాలికకు వైద్య పరీక్షలు

**- మంత్రి ఆదేశాలతో రుయా ఆస్పత్రికి తరలింపు**



**ములకలచెరువు,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండల కేంద్రంలోని రాజీవ్ కాలనీలో నివాసముంటున్న విజయమ్మ కుమార్తె చంద్రిక(6) పుట్టుకతోనే వింత వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి తల్లిదండ్రులు అనేక చికిత్సలు చేయించారు. అయితే ఫలితం లేకుండా పోయింది. ముఖమంతా నల్లగా మారి కంటి పక్కన పెద్ద పుండు ఏర్పడి చిన్నారి బాధపడుతోంది. ఇంత వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని ఆదుకోండి అనే శీర్షికన పత్రికలలో వెలువడటంతో స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లా డిఎంహెచ్‌వో లక్ష్మీ నరసయ్య వైద్య సిబ్బందితో ఆదివారం వింత వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని సందర్శించారు. చిన్నారికి చికిత్సలు అందించారు. ఈ వ్యాధి జన్యుపరమైన వ్యాధి అయ్యి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. నిర్ధారణ కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు అవసరమైన చాలా పరీక్షలు మరియు ఉన్నత వైద్య సంస్థ సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బాలికకు ప్రత్యేక వైద్య చికిత్స మరియు ఖచ్చితమైన నిర్ధారణ కోసం తిరుపతి ప్రభుత్వ రూయా ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు. వింత వ్యాధితో బాధపడుతున్న బాలికను రెడ్డి బిజెపి జాతీయ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, రాష్ట్ర ఓబిసి కోశాధికారి, సరస్వతి స్కూల్ కరస్పాండెంట్ మడుమూరు రామదాసులు సందర్శించారు. చిన్నారికి వైద్య పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని చల్లపల్లి నరసింహారెడ్డి తెలిపారు. చిన్నారిని పదవ తరగతి వరకు తన పాఠశాలలో చదివిస్తానని సరస్వతి పాఠశాల కరస్పాండెంట్ ముడుమూరు రామదాసు తెలిపారు. చిన్నారి చికిత్స నిమిత్తం కోసం ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ నవీన్ కుమార్ రెడ్డి రూ.30 వేలు, వ్యవసాయ అధికారి స్రవంతి రూ.10 వేలను చిన్నారి తల్లికి అందజేశారు. రియాజ్ పత్రిక చేరుకున్న చిన్నారికి ఆసుపత్రి వైద్యులు చికిత్సలు చేపట్టారు.

# 'సర్'ను పటిష్టంగా పూర్తి చేయాలి

**- తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి**

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె/ కురబలకోట,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం, కురబలకోట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు, కొత్తగా అర్హత పొందిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు, మరణించిన వారి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. సేకరించిన సమాచారాన్ని ఆలస్యం లేకుండా ఆన్‌లైన్‌లో డిజిటలైజేషన్ చేసి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓటరు జాబితా ఖచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు ఎంతో కీలకమని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వెంటనే పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రత్యేక అవకాశాన్ని వినియోగించుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, సంబంధిత తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి



**పీలేరు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని పీలేరు మండలం ముడుపులు వేముల గ్రామ ఇన్చార్జి డాక్టర్ పల్లవోలు హేమచంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ఆదివారం ముడుపుల వేముల గ్రామంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలి. తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలి. సర్ ప్రక్రియను విజయవంతం చేయడానికి అధికారులకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ శంకర్, చంద్రయ్య, 213 బూత్ ఇంచార్జ్ శ్రీనివాసులు, బిఎల్ఏలు, బీఎల్‌వోలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# 'జ్ఞానపీఠ' అవార్డు సాధించిన మూడవ తెలుగు రచయిత రావూరి భరద్వాజ

**- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి**



**కడప, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూలీగా, వ్యవసాయ కార్మికునిగా ప్రారంభించి అనేక కష్టాలను అధికమించి, వినూత్న సాహిత్యాన్ని సృష్టించి, అత్యున్నత జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న రావూరి భర ద్వాజ సాహితీ లబ్ధ ప్రతిష్టులని వైయస్సార్ జిల్లా రచయిత సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రావూరి భరద్వాజ శత జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఆయన జీవితంలో ఎన్నో ఆటు పోట్లు, ఒడిదుడుకులు ఉన్నా స్వయంకృషితో ఎదిగిన గొప్ప సాహితీ వృక్షమని, భరద్వాజ కలం నుండి దాదాపు 37 కథా సంపుటాలు,17 నవలలు, 10 నాటకాలు, 5 బాలల కథా సంపుటాలు, స్మృతి కావ్యాలు వెలుపడ్డాయని, ఆయన సినిమాల్లో తెర వెనుక జరుగు తున్న చీకటి కోణాల్ని స్పృశించి రాసిన 'పాకుడు రాళ్లు' నవలకు జ్ఞానపీఠ సత్కారం లభించిందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, నిత్య ప్రభాకర్, కళాకారులు దాసరి సుధాకర్, పసుపులేటి సుధాక ర్,ప్రకాశం, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, వెంకటసుబ్బ య్య,త దితరులు పాల్గొన్నారు.

# హనుమత్ సుందరకాండ టీజర్ విడుదల

**- చిత్ర నిర్మాణ రంగంలోకి నిశ్చితా సేతు**



**మదనపల్లె,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యా రంగంలో వినూత్న ఆలోచనలతో ముందుకు సాగుతున్న విజయభారతి హైస్కూల్ ప్రిన్సిపల్ నిశ్చితా సేతు కొత్తగా చలనచిత్ర రంగంలో కూడా రాణించేందుకు తొలి అడుగు వేశారు. సహచర మిత్ర బృందంతో కలిసి రూపొందిస్తున్న హనుమత్ సుందరకాండ యానిమేషన్ చిత్రంతో నిర్మాతగా సినీ రంగ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా విజయభారతి హైస్కూల్‌లో చిత్ర టీజర్‌ను ఆరు భాషల్లో విడుదల చేశారు. తెరపై హనుమంతుడి అద్భుత సాహసాలు, అత్యున్నత యానిమేషన్ హంగులతో రూపొందించిన ఈ టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. హనుమ శౌర్యం, భక్తి, పరాక్రమం ప్రతిబింబించే దృశ్యాలు అలరిస్తాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయభారతి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ సేతు, ప్రముఖ వైద్యులు డాక్టర్అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పులి నరేంద్రరెడ్డిలు హాజరు అయ్యారు. చిత్రం యొక్క టీజర్‌ను చూసి ప్రశంసలు కురిపించారు. భారతీయ ఇతిహాస వైభవాన్ని నేటితరానికి చేరువచేసేలా దర్శకుడు సన్నివేశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని అభినందించారు. వచ్చే ఏడాది వినాయక చవితికి ఈ చిత్రం విడుదల చేయను న్నట్లు చిత్ర బృందం తెలిపింది.

# సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలి

**కడప,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందండాలని జేబీ ఫౌండేషన్ చైర్మన్ జహంగీర్ భాషా అన్నారు. విపత్తు సమయంలో ప్రాణాలను సైతం పక్కనపెట్టి పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తు జనం కోసం యూత్ వ్యవస్థా పకులు లయన్ పటాన్ ఖాద ర్బాషాను వారు ఘనంగా సత్కరించారు. ఆదివారం జేబీ ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జే కే ను ఘనంగా శాలువాతో సత్కరించి మెమొం టో ఇవ్వడం జరిగింది. జేబీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ జహంగీర్ భాష మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలు చేయడం చాలా ఆనందకరమైన జెకె యూత్ వారు చేస్తున్న సేవ నిరుపేద ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యూ బేదుల్లా డాక్టర్ పరమేశ్వరరావు ,జన వికాస్ సేవాసమితి వ్యవస్థాపకులు ఎస్ఎం తాహీర్ స్టాఫ్ పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

# ఎమర్జెన్సీ హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కలకడ, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలకడ పట్టణం గుర్రంకొండ రోడ్డులోని కోట రమణ ప్రైవేట్ ఎమర్జెన్సీ హాస్పిటల్‌ను ఘనంగా ప్రారంభించారు. డాక్టర్ హర్షవర్ధన్ నాయుడు ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి హాస్పిటల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలకడ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ఈ హాస్పిటల్ ఎంతో ఉపయోగపడుతుంది. నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో చికిత్స అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, నల్లారి అభిమానులు, ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత గ్రామాలలో కుల వివక్షతపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

**- సిఐని కలిసిన ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకత్వం**




**పీలేరు, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీలేరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి వెంకటేశ్వర్లును ఎంఆర్పిఎస్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గండికోట వెంకటేష్, ఎంఆర్‌పిఎస్/ ఎంఎస్‌పి యువ నాయకత్వంతో నూతన సిఐని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్సీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పారదర్శంగా పరిష్కరించాలని మారుమూల గ్రామాల్లో నేటికీ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అగ్రవర్ణాల చేత అనేక రకాలుగా వివక్షతకు గురవుతున్నారని గ్రామాల్లో అవేర్నెస్ ప్రోగ్రాంలు నిర్వహించి వివక్షతను రూపు మాపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మేజర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎస్ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో వీలైనంత త్వరగా అవగాహన సదస్సు నిర్వహించి చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించి వివక్షత, అసమానతలు రూపుమాపేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ పీలేరు మండలం అధ్యక్షులు రెడ్డి కుమార్, మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పి) మండల అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సీనియర్ నాయకులు బండ్ల వంక పివి రమణ, వెంకటరమణ, మురళి, ఎమ్మార్పీఎస్ యూత్ పీలేరు నియోజకవర్గం అధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి నరసింహులు, యువ నాయకులు రాము, లక్ష్మణ్,పవన్, తరుణ్, నరేష్, రూపేస్, హరీష్, సాయి, నాని, హర్ష, చరణ్, సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ వై.ఎస్.మునిరత్నం



**మదనపల్లె,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె పట్టణానికి చెందిన డాక్టర్ వై. ఎస్. మునిరత్నం ఏపీ రాష్ట్ర ఆహారం వినియోగదారులు, హక్కులు, పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అన్ని విధాలుగా సహకరించిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జనసేన పార్టీ రాయలసీమ కో- కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరికి ధన్యవాదాలు తెలిపారు.

# మిట్స్ డీమ్డ్ టు బి వర్సిటీలో పీహెచ్.డి ప్రవేశ పరీక్ష



**మదనపల్లె/ కురబలకోట, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ విభాగాలకు సంబంధించిన పీహెచ్.డి ప్రవేశ పరీక్షను నిర్వహించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షకు 133 మంది అభ్యర్థులు హాజరు అయ్యారని చెప్పారు. పరీక్షను పారదర్శకంగా,క్రమశిక్షణతో నిర్వహించడంతోపాటు అభ్యర్థులకు అవసరమైన అన్నిసౌకర్యాలను కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. పరిశోధనకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ,అత్యాధునిక ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశ్రమలు, ప్రముఖ పరిశోధనా సంస్థలతో భాగస్వామ్యాలు,ఆధునిక పరిశోధనా మౌలిక వసతులతో మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ పరిశోధకులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట అవకాశాలను అందిస్తోందని తెలిపారు. ప్రవేశ పరీక్ష అనంతరం యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హత, ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఉపకులపతి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, అసోసియేట్ డీన్ (పీహెచ్.డి ప్రోగ్రామ్స్) డాక్టర్ ఎన్.నంద కుమార్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సాయి కుమార్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

# ఎస్బిఐ స్కాలర్షిప్‌లకు మిట్స్ విద్యార్థులు ఎంపిక



**మదనపల్లె/ కురబలకోట,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్బిఐ ప్లాటినమ్ జూబ్లీ ఆశా మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్షిప్ లకు ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పట్నం అల్మాస్, చరణ్ రాయల్ (ఏఐ అండ్ ఎంఎల్), ఆర్ వి. రామ్ చరణ్ (డేటా సైన్స్)లకు ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున మొత్తం రూ.2.25 లక్షలు ఉపకార వేతనంగా వచ్చిందన్నారు. విద్యార్థతల్లో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా ఎస్బీఐ ఫౌండేషన్ వారు ఉపకార వేతనాలు అందిస్తున్నారన్నారు. ముగ్గురు విద్యా ర్థులను ఛాన్సులర్ డాక్టర్ ఎన్. విజయభాస్కరౌచౌదరి, ప్రో-ఛాన్సులర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, వీసీ డాక్టర్ సి. యువరాజ్, సీనియర్ మేనేజర్ అథహర్ సమీనా, అధ్యాపకులు అభినందించారు.

# జీఓ నంబర్ 396ను ఉపసంహరించుకోవాలి

**- దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్స్ నిరసన**

**మదనపల్లె,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించాలని,అందుకోసం తక్షణమే జీవో నంబర్ 396ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం (మదనపల్లె, అన్నమయ్య జిల్లా శాఖ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు రంగు గుణశేఖర్, కార్యదర్శి కంగేరి నందా కమిటీ సభ్యులతో కలిసి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలిపారు. ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సేవలను ప్రైవేటుపరం చేసే అలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అస్తుల రక్షణ కోసం వివాదాస్పద జీవో నంబర్ 396ను వెంటనే రద్దు చేయాలన్నారు.అనంతరం సబ్ రిజిస్ట్రార్ గురుస్వామికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో దస్తావేజులేఖర్ల సంఘం మదనపల్లె కమిటీ సభ్యులు మంచినీళ్ల నాగ మునీంద్ర, రంగు రాజేంద్ర, రెడ్డప్ప, లవాని మహమ్మద్ ఖాన్, కరూర్ వెంకటేష్, రామయ్య గుప్తా, సాయిరాం, మచ్చా నారాయణ, చంద్రశేఖర్, సాయి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్‌లో భారీగా పదోన్నతులు

ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా.. 26 మంది ఆఫీస్ సబార్డినేట్లకు ల్యాబ్, లైబ్రరీ, రికార్డ్ అసిస్టెంట్లుగా ప్రమోషన్



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ జిల్లా పరిషత్ యంత్రాంగం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ జె. అరుణ, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా వివిధ విభాగాల్లోని ఉద్యోగులకు పెద్ద ఎత్తున పదోన్నతులు మంజూరు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. అలాగే 26 మంది ఆఫీస్ సబార్డినేట్లను ల్యాబ్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందించి, కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, సీఈఓతో పాటు జిల్లా పరిషత్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# భారత జాతికి త్రివర్ణ పతాకాన్ని అందించిన మహనీయుడు

## పింగళి వెంకయ్య కృష్ణాజిల్లా వాసి కావడం గర్వకారణం -- సీఐ అబ్దుల్ నబీ.



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భారత జాతీయ పతాక రూపశిల్పి 64వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మచిలీపట్నంలోని రోడ్లు--భవనాల అతిథి గృహం వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగానివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిలకలపూడి--మచిలీపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ నబీ, పి జగదీష్ కుమార్ మాట్లాడుతూ, భారత జాతికి త్రివర్ణ పతాకాన్ని అందించిన మహనీయుడు పింగళి వెంకయ్య కృష్ణాజిల్లాకు చెందినవారు కావడం ప్రతి తెలుగు వాడికీ, ప్రతి భారతీయుడికీ గర్వకారణమని అన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి చేరవేసేందుకు వెలుగు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ, భారతదేశానికి అంతర్జాతీయ గుర్తింపునిచ్చిన జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అలాగే ప్రతి విద్యాసంస్థలో పింగళి వెంకయ్య జీవిత విశేషాలు, దేశానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పాలకులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి ఐటీఐ చైర్మన్ జి. రమేష్, వెలుగు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రేపల్లె హనుమంతరావు, డి. జగ్గారావు, పోలీసు సిబ్బంది, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పాల్గొని పింగళి వెంకయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** దివంగత నాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా మచిలీపట్నం ఈడేపల్లిలోని జెట్టి నరసింహ వృద్ధాశ్రమంలో శనివారం ఉమ్మడి ఆంధ్ర రాధా--రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాధా--రంగా మిత్రమండలి అధ్యక్షులు ఆర్.ఎస్.ఆర్. శ్రీరామ్ మోహనరావు, సామాజిక కార్యకర్త మాదివాడ రాము పాల్గొని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వంగవీటి మోహనరంగా సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మంత్రి కొల్లు వృద్ధాశ్రమంలోని పెద్దలను ఆప్యాయంగా పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి...

ఘన నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భారతదేశ స్వాతంత్రం కోసం వీరోచితంగా పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగశీలిని, పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని, స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి నీ పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీతారామరాజు భారత స్వాతంత్ర చరిత్ర లో ఒక మహోజ్వల శక్తి , బ్రిటిష్ వారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన విప్లవ జ్యోతి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలర్పించాడని, అతడి దేశభక్తి స్ఫూర్తి, భారతీయ జాతీయవాదం జ్వాలలను రేకెత్తించిందని, దేశంలో బ్రిటిష్ పాలకుల దోపిడీ, దురాగతాలు, దమనకాండలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేకమందిని ప్రేరేపించిందని గుర్తుచేశారు. సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం తెలుగు జాతి చరిత్రలో గొప్ప ఘట్టంగా చిరస్థాయిగా నిలిచి ఉంటుందని, తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఆయన త్యాగశీలిని, పోరాటపటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్ అధికారులకు సిబ్బందికి మిఠాయిలు పంచారు.

# అల్లూరి సీతారామరాజు ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

జయంతి సందర్భంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం దేశ ప్రజలకు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువత అల్లూరి సీతారామరాజు జీవితం నుంచి స్ఫూర్తి పొంది దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. వాయు కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛ మైన గాలి కోసం కృషి చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సైకిల్ పై ప్రయాణించి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డిఆర్ఓ పి పోతురాజు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, కలెక్టరేట్ ఏఓ రాధిక, సూపరింటెండెంట్ నెల్సన్ పాల్, కలెక్టరేట్ తహసిల్దార్ హరనాథ్, డిప్యూటీ తాసిల్దార్ నారాయణ, సుభాష్ తదితర కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘనంగా నివాళు లర్పించారు.

# నెల్లూరులో పర్యటించిన మంత్రి నారాయణ



**నెల్లూరు జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సిటీ నియోజకవర్గంలో మంత్రి నారాయణ ఆదివారం పర్యటించారు. కాలువలు, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న ఇంటర్నేషనల్ స్కూల్ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ఐదేళ్లలో ఏం చేసిందని ప్రశ్నించారు. సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలను ఆధునికీకరిస్తున్నట్లు వివరించారు. 123 మున్సిపాలిటీల్లో రూ.18 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయన్నారు. సిటీలో రూ.50 కోట్లతో 15 డ్రైన్లను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ వరకు పనులు పూర్తి చేసి నెల్లూరు ప్రజలకు ముంపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కూటమి ప్రభుత్వంలో విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత: మంత్రి సంధ్యారాణి



**వినుకొండ జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం వినుకొండ మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని చెక్కవాగు వద్ద రూ.3కోట్లతో నిర్మించిన గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో విద్యార్థులకు కొత్త పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. పాఠశాల కాంపౌండ్ వాలు, డార్మిటరీ కోసం రూ.6 కోట్లు మంజూరు చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారు. గిరిజనులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో కొత్త ట్రైబల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన బాలికల పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనను పరిశీలిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జూలై 6 నుంచి 11 వరకు జిల్లాలో పరీక్షల నిర్వహణ

మొత్తం 3,824 మంది అభ్యర్థులు హాజరు

----జిల్లా రెవిన్యూ అధికారి పి పోతురాజు



**మచిలీపట్నం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న డిపార్ట్‌మెంట్ పరీక్షలు (మే--2026 సెషన్) విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి పి పోతురాజు తెలిపారు. శనివారం ఉదయం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో ఏపీపీఎస్సీ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో ఏపీపీఎస్సీ డిపార్ట్మెంటల్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జూలై 6 నుంచి జూలై 11, 2026 వరకు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఈ పరీక్షలు నిర్వహించబడనున్నాయని తెలిపారు. జిల్లాలో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, మొత్తం 3,824 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), ఆఫ్‌లైన్ (కన్వెన్షనల్ టైప్) విధానాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆబ్జెక్టివ్ విధానంలోని పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడతాయని అదేవిధంగా, కన్వెన్షనల్ విధానంలోని పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అయితే పీసీ నెం.005 పరీక్ష మాత్రం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించ బడుతుందన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా స్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం లైజన్ అధికారిని, చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణం లో, ఎలాంటి అంతరాయాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ ద్వారా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులకు తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**అభ్యర్థులకు సూచనలు**

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు బయోమెట్రిక్ నమోదు కోసం ఉదయం సెషన్‌కు ఉదయం 8 గంటల నుంచి 8.45 గంటల మధ్య పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. ప్రత్యేక పరిస్థితుల్లో ఉదయం 9 గంటల వరకు మాత్రమే గ్రేస్ పీరియడ్ ఉంటుంది. మధ్యాహ్నం సెషన్‌కు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.15 గంటల మధ్య కేంద్రానికి చేరుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే గ్రేస్ పీరియడ్ ఉంటుంది. గ్రేస్ పీరియడ్ ముగిసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు తప్పనిసరిగా అసలైన ఫోటో గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ లేదా డ్రైవింగ్ లైసెన్స్)తో పాటు హాల్ టికెట్ తీసుకురావాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, హ్యాండ్‌బ్యాగులు, పుస్తకాలు, నోట్స్, రైటింగ్ ప్యాడ్లు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. రఫ్ షీట్లు, పెన్నులు పరీక్షా కేంద్రంలోనే అందజేయబడతాయని పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా మాల్ ప్రాక్టీస్ లేదా ఇతర అక్రమాలకు పాల్పడినట్లయితే ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారులు శంకర్రావు, దేవసహాయం, సీఐ షేక్ అబ్దుల్ నబీ, డిప్యూటీ తహసిల్దార్లు నారాయణ, భవాని, విద్యుత్ శాఖ ఏఈ వంశీ, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు.. తప్పిన పెను ప్రమాదం



**టెక్కలి జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏపీఎస్ ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు టెక్కలి - తెంబూరు మార్గంలో రహదారి పక్కకు ఒరిగింది. ఈ మార్గంలో గొట్టా బ్యారేజీ నుంచి మూలపేట పోర్టుకు తాగునీటి పైపు లైన్ పనుల కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో బస్సు రోడ్డు పక్కకు ఒరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

# బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

## తండ్రీకుమారులకు తీవ్ర గాయాలు



**కళ్యాణ దుర్గం జూలై 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. ఓ తండ్రీ కుమారులు బెలుగుప్ప మండలం శ్రీరంగాపురం నుంచి అనంతపురానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వస్తున్న ఆర్టీసీ బస్సు.. బోరంపల్లి గ్రామం మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని అదుపుతప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## ఎన్టీఆర్ & నెల్సన్... సాధ్యమవుతుందా?



జైలర్ తర్వాత దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ పేరు ఏ స్థాయిలో సౌత్ మొత్తం మారుమ్రోగిపోయిందో అభిమానులు అంత సులభంగా మర్చిపోలేరు. సూపర్ స్టార్ రజనీకాంత్ వరస ఫ్లాపులతో ఉన్నప్పుడు ఆయనకంత పెద్ద బ్లాక్ బస్టర్ ఇవ్వడం చిన్న విషయం కాదు. అందుకే జైలర్ 2 కూడా ఓకే అయిపోయి అక్టోబర్ విడుదలకు రెడీ అవుతోంది. అయితే సితార సంస్థకు తనో కమిట్ మెంట్ ఇచ్చాడు. అది కూడా జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ఒక పెద్ద ప్యాన్ ఇండియా మూవీ తీయాలనే ప్లాన్ తో. ఇదంతా గతం. ఇప్పుడు వర్తమానంలోకి వద్దాం. నెల్సన్ దిలీప్ కుమార్ జైలర్ 2 పూర్తి చేసిన వెంటనే రజినీకాంత్ కమల్ హాసన్ మల్టీస్టారర్ పనులు మొదలుపెట్టాలి. ఇది ఆషామాషీ సినిమా కాదు. 38 సంవత్సరాల తర్వాత ఇద్దరు దక్షిణాది లెజెండ్స్ స్క్రీన్ పంచుకోబోతున్నారు. దానికి తగ్గట్టే సెటప్, స్క్రిప్ట్ ఉండాలి. కొంచెం ఎక్కువ సమయం అవసరం పడేలా ఉండటంతో ఈలోగా ధర్మన్ పూర్తి చేసుకుందామని రజని అందులో బిజీ అయ్యారు. డిసెంబర్ కంతా ఫ్రీ అయిపోతారు. ఈ లెక్కన రజని కమల్ మూవీ 2028లో రిలీజ్ అవుతుంది. అంతకన్నా ముందు కష్టమే. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే డ్రాగన్ అయిపోయాక త్రివిక్రమ్ తో ప్యాన్ వరల్డ్ ఫాంటసీ మూవీ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. కమర్షియల్ కథలకే ఎక్కువ టైం తీసుకునే మాటల మాంత్రికుడు ఇప్పుడీ విజువల్ గ్రాండియర్ కి ఎంత సమయం అడుగుతారో తెలియదు. ఇది కూడా ఇంచుమించు 2028 కంటే ముందు వచ్చే ఛాన్స్ లేదు. సో ఈ కలయిక కార్యరూపం దాల్చాలన్నా రెండు సంవత్సరాలకు పైగా వెయిట్ చేయాల్సిందే. నాగవంశీ అయితే ఈ కాంబినేషన్ వదలను అనే పట్టుదల చూపిస్తున్నారు. మరి నెల్సన్ ఏమంటారో చూడాలి. ఎలాగూ జైలర్ 2 ప్రమోషన్స్ టైంలో బయటికి వస్తారు కాబట్టి అప్పుడేమైనా క్లారిటీ ఇస్తారేమో. తమిళ డైరెక్టర్లు ఈ మధ్య తెలుగు స్టార్లతో పని చేయడానికి ఉవ్విల్లూరుతున్నారు. నెల్సన్ కూడా అదే రీతిలో టెంప్ట్ అయినట్టు ఉన్నాడు. తారక్ కోసం ఎలాంటి కథ రాసుకున్నాడో.

## బేబీకి మూడు రెట్లు ఉంటుందా?



చిన్న సినిమాల మీద జనాల్లో ఆసక్తి పెంచేందుకు, వాళ్లను థియేటర్లకు రప్పించేందుకు మేకర్స్ తమ చిత్రాల గురించి కొంచెం ఎక్కువ చేసే చెప్పుకుంటూ ఉంటారు. ఈ శుక్రవారం రిలీజైన రావు బహదూర్ గురించి కూడా టీం చాలా గొప్పగానే చెప్పుకుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ తరహాలో వేరే ఇండస్ట్రీలు చెప్పుకునే తెలుగు సినిమా ఇదన్నారు. అంతే కాక సత్యదేవ్‌ను కమల్ హాసన్‌కు రీప్లేస్మెంట్ అని కూడా స్టేట్మెంట్ ఇచ్చేశారు. ఐతే రావు బహదూర్ మంచి సినిమానే అయినా, సత్యదేవ్ బాగా పెర్ఫామ్ చేసినా.. సినిమా చూసినపుడు ఆ స్టేట్మెంట్లు అయితే అతిగానే అనిపించాయి. ఇప్పుడు చెన్నై లవ్ స్టోరీ గురించి రచయిత, నిర్మాత సాయి రాజేష్ వ్యాఖ్యలు కూడా ఇలాగే కొంచెం బోర్డర్ దాటేసినట్లు కనిపిస్తున్నాయి. తాను తీసిన బేబీ సినిమాకు చెన్నై లవ్ స్టోరీ మూడు రెట్లు ఉంటుందని ఆయన స్టేట్మెంట్ ఇవ్వడం గమనార్హం. చెన్నై లవ్ స్టోరీ సినిమాను తాను ఇప్పటికే పదిసార్లు చూశానని.. తాను తీసిన బేబీ సినిమాలో ఉన్న ఎమోషన్‌తో పోలిస్తే రెండు రెట్లు కాదు, మూడు రెట్లు గొప్ప సినిమా ఇది అవుతుందనడంలో సందేహం లేదని సాయిరాజేష్ అన్నాడు. ఈ సినిమాను ప్రేక్షకులు సూపర్ హిట్ చేస్తారా, బ్లాక్ బస్టర్ చేస్తారా అన్నది వాళ్ల చేతుల్లో ఉందని.. కానీ మంచి సినిమా తీయడం మాత్రం తమ చేతుల్లో ఉందని.. తాము మాత్రం చాలా గొప్ప సినిమా చేశామని చాలా నమ్మకంగా చెప్పగలమని సాయి రాజేష్ అన్నాడు. మరో నిర్మాత ఎస్కేఎన్ మాట్లాడుతూ.. ఒక మెగా అభిమానిగా తనకు జులై 24 చాలా స్పెషల్ అని.. ఆ రోజే ఇంద్ర, తొలి ప్రేమ సినిమాలు రిలీజై బ్లాక్‌బస్టర్లు అయ్యాయని.. అదే కోవలో చెన్నై లవ్ స్టోరీ కూడా పెద్ద సక్సెస్ అవుతుందని.. ముందు రోజు రాత్రే ఈ చిత్రానికి పెయిడ్ ప్రిమియర్స్ పెద్ద ఎత్తున వేస్తామని చెప్పాడు. కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన చెన్నై లవ్ స్టోరీకి రవి నంబూరి దర్శకత్వం వహించాడు. మరి సాయి రాజేష్ చెబుతున్నంత గొప్పగా చెన్నై లవ్ స్టోరీ ఉంటుందా.. బేబీని మించిన సినిమా అవుతుందా అన్నది చూడాలి.

## 'అబ్సెషన్' గురించి అంత మాట అనేశారేంటి వంశీ



మొన్నటిదాకా ఒక చిన్న సినిమా ప్రపంచ సినీ ప్రియులను ఊపేయడం అబ్సెషన్ విషయంలోనే జరిగింది. అతి తక్కువ బడ్జెట్ తో రూపొంది వందల కోట్ల వసూళ్లను మంచి నీళ్లు తాగినంత ఈజీగా రాబట్టిన ఈ సైకో డ్రామా హైదరాబాద్ లో చాలా రోజులు హౌస్ ఫుల్స్ తో నడిచింది. జిల్లా కేంద్రాల్లో పెద్ది వల్ల ఒకటి రెండు వారాలు ఆలస్యంగా విడుదలైనా కలెక్షన్లు కురిపించుకుంది. తెలుగు డబ్బింగ్ లేకుండా చాలా చోట్ల సబ్ టైటిల్స్ వేయ కుండా ఇంత మొత్తం రాబట్టడం మాములు విషయం కాదు. అయితే నిర్మాత నాగవంశీ దీన్ని అనాలిసిస్ చేసిన కోణం ఇంకోలా ఉంది. లెనిన్ ప్రమోషన్లలో భాగంగా మా ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టెక్నికల్ అంశాల కోసం మనోళ్లు అబ్సెషన్ చూడలేదని, ఒక అమ్మాయిబ్ సైకోగా మారి ప్రియుడిని వేధిస్తే ఎలా ఉంటుందో చూద్దామని వచ్చారని కొత్త నిర్వచనం ఇచ్చారు. ఇలా అంటే తన మీద సోషల్ మీడియాలో అటాక్ జరుగుతుందని చెప్పడం గమనార్హం. గతంలో క్రిస్టోఫర్ నోలన్ సినిమాల గురించి వంశీ చేసిన కామెంట్స్ వైరలయ్యాయి. నాణేనికి రెండు వైపులా తరహాలో నాగవంశీ చెప్పిన దాంట్లో తప్పు ఒప్పు రెండూ ఉన్నాయి. భాష అర్థం కాకపోయినా అందులో అంత గొప్పగా ఏముందో అని చూసిన ఆడియన్స్ భారీగా ఉన్నారు. ఊహించని ట్విస్టులతో హీరోయిన్ చేసే మర్డర్లకు థ్రిల్ అయినవాళ్ళు బోలెడు. ఇంకోవైపు సౌండ్ డిజైన్, కెమెరా వర్క్, దర్శకుడి ఆలోచనా విధానంకు అబ్బురపడి చూసినవాళ్లు ఎక్కువే. సో ఇదేదో ఆషామాషీ హిట్టుగా తీసుకునే మూవీ అయితే ఖచ్చితంగా కాదు. అబ్సెషన్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. తక్కువ ఖర్చులో అద్భుతాలు చేయొచ్చని అర్థమయ్యాక చాలా మంది ఫిలిం మేకర్స్ ఇప్పుడా దారిలోనే వెళు తున్నారు. స్టార్ క్యాస్టింగ్ లేకుండా కేవలం మౌత్ టాక్ తో ఒక సినిమా ఇంత పెద్ద స్థాయికి వెళ్లడం ఒక రిఫరెన్స్ గా మారింది. గత రెండు నెలల్లో ఎందరో టాలీవుడ్ బాలీవుడ్ సెలబ్రిటీలు పలు సందర్భాల్లో అబ్సెషన్ ప్రస్తావన తెచ్చి మరీ దాని గొప్పదనాన్ని పంచుకున్నారు. అన్నట్టు అబ్సెషన్ 2 ఉంటుందా లేదాని మూవీ లవర్స్ ఎదురుచూస్తున్నారు.




## దీపిక బాటలో కాజల్... కొన్ని గంటలే...!



రోజుకు 8 గంటలకు మించి పని చేయనంటూ ఈ మధ్య దీపిక పదుకొనే ఫిలిం మేకర్స్‌కు కండిషన్ పెట్టడం ఎంత చర్చనీయాంశం అయిందో తెలిసిందే. దీని వల్ల ఆమె కల్కి-2, స్పిరిట్ లాంటి క్రేజీ ప్రాజెక్టులకు దూరం కావాల్సిన పరిస్థితి కూడా తలెత్తిందని వార్తలు వచ్చాయి. ఐతే ఈ కండిషన్ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సినిమా షూటింగ్ అన్నది ఎందరో డేట్లతో ముడిపడి ఉంటుంది, ఇంకా ఎన్నో ఇబ్బందులు ఉంటాయి కాబట్టి.. టైమింగ్స్ విషయంలో మరీ అంత పర్టికులర్‌గా ఉంటే ఎలా అనే ప్రశ్నలు వేశారు కొందరు. మరి కొందరేమో దీపిక పద్ధతి కరెక్టే అని వాదించారు. సినిమా నటులకు వ్యక్తిగత జీవితాలు ఉండవా.. ప్రతిరోజూ కాంప్రమైజ్ అవుతూ పోతే కష్టం కదా అన్న వాదన వినిపించింది. హీరోయిన్లలో కొందరు దీపికకు మద్దతుగా గళం విప్పారు. ఇప్పుడు కాజల్ అగర్వాల్ కూడా అదే తరహాలో మాట్లాడుతోంది.

తాను కూడా వర్కింగ్ అవర్స్ విషయంలో ఇప్పుడు చాలా పర్టికులర్‌గా ఉంటున్నట్లు ఆమె చెప్పింది. ఒకప్పుడు తాను రౌండ్ ద క్లాక్ పని చేశానని.. టైమింగ్స్ చూసుకునేదాన్ని కాదని.. కానీ ఇప్పుడు మాత్రం అలా పని చేయలేనని చందమామ స్పష్టం చేసింది. ఇప్పుడు తనకు పెళ్లయి ఒక కుటుంబం ఉందని, కొడుకు ఉన్నాడని.. వాళ్ల కోసం సమయం కేటాయించాల్సిందే అని.. కాబట్టి రోజూ ఇన్ని గంటలే పని చేస్తానని, ఆదివారాలు షూటింగ్‌కు రానని ముందే అగ్రిమెంట్లో స్పష్టం చేస్తున్నానని కాజల్ వెల్లడించింది. ఆర్టిస్టులు ఇలా కోరుకోవడం తప్పేమీ కాదని ఆమె అభిప్రాయపడింది. అన్ని రంగాల్లో పని వేళలు ఉన్నప్పుడు సినీ రంగంలో మాత్రం ఎందుకు ఉండకూడదని ఆమె పేర్కొంది. పెళ్లి తర్వాత కాజల్ కెరీర్ కొంచెం నెమ్మదించగా.. ఇటీవల ఆమె నందమూరి బాలకృష్ణ కొత్త సినిమాతో మళ్లీ వార్తల్లోకెక్కింది. హిందీలో కాజల్ నటించిన ది ఇండియా స్టోరీ ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# బిజినెస్ న్యూస్



## ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించండి

### : మెటాకు కేంద్రం ఆదేశాలు..





చిన్నారులపై లైంగిక వేధింపులను ) ప్రేరేపించేలా ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో కేంద్ర ప్రభుత్వం మెటా (వీమ్ఖ)కు నోటీసులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వేధింపులను పోత్సహించేలా ఇన్‌స్టాలో ఉన్న ప్రకటనలు (Child Abuse Advertisements), కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఈ విషయం పై 7రోజుల్లోగా వివరణ ఇవ్వాలని పేర్కొంది. వివరణ ఇవ్వడంలో విఫలమైతే.. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇలాంటి ప్రకటనలకు ఎలా ఆమోదం ఇచ్చారని కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని మెటా (వీమ్ఖ)ను ఆదేశించింది. థర్డ్ పార్టీ కంటెంట్ అయినప్పటికీ ప్రకటనల ద్వారా మెటాకే ఆదాయం వస్తుంది కాబట్టి.. ఈ ఆరోపణలు నిజమని తేలితే ఆ సంస్థనే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

## హోండా కారుపై రూ.2.15 లక్షల డిస్కౌంట్!

జూలై 2026 నెలలో హోండా కార్స్ ఇండియా.. ఎంపిక చేసిన కొన్ని కార్లపై ఆకర్షణీయమైన డిస్కౌంట్లను, ప్రయోజనాలను ప్రకటించింది. ఇందులో నగదు తగ్గింపు, ఎక్స్‌చేంజ్ బోనస్, కార్పొరేట్ బెనిఫిట్స్ వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఈ ఆఫర్స్ కేవలం జూలై 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. హోండా ఎలివేట్ కారుపై కంపెనీ గరిష్టంగా రూ.2.15 లక్షల డిస్కౌంట్ అందిస్తోంది. ఇందులో రూ. 40,000 వరకు నగదు తగ్గింపు, రూ. 30,000 వరకు ఎక్స్‌చేంజ్ ప్రయోజనం, కార్పొరేట్ ఆఫర్లు, లాయల్టీ ప్రయోజనాలు ఉన్నాయి. సాధారణంగా హోండా ఎలివేట్ ధరలు రూ. 11.60 లక్షల నుంచి రూ. 16.16 లక్షల మధ్య ఉన్నాయి. అయితే ఇది దేశీయ విఫణిలో హ్యుందాయ్ క్రెటా , కియా సెల్టోస్ , టాటా సియెర్రా, మారుతి విక్టోరిస్, మారుతి గ్రాండ్ విటారా, రెనాల్ట్ డస్టర్‌లకు ప్రత్యర్థిగా ఉంటుంది. సెడాన్ల విభాగంలో కొత్త హోండా అమేజ్ కొనుగోలుపై రూ. 67,000 వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. హోండా అమేజ్ సెకండ్ జనరేషన్ మోడల్ మీద రూ. 58,000 వరకు డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ కొనుగోలుపైన ఎలాంటి తగ్గింపులు లేదు. ఎందుకంటే ఈ కారు ఇటీవలే షోరూమ్‌లలోకి వచ్చింది. చీశీవ: కంపెనీ అందించే డిస్కౌంట్స్ లేదా ప్రయోజనాలు నగరాన్ని బట్టి మారుతూ ఉంటాయి. కాబట్టి కొనుగోలుదారులు మీరు కొనే కారుపై ఎంత డిస్కౌంట్ లభిస్తుంది అనే వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవడానికి సమీపంలోని డీలర్షిప్ సందర్శించాలి.



## వాతావరణ నష్టాలకు 'సర్వత్ర సురక్ష' భరోసా



వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తుల వల్ల తలెత్తే ఆర్థిక నష్టాల నుంచి బీమాదారులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వ రంగంలోని ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. 'సర్వత్ర సురక్ష పారామెట్రిక్ పాలసీ' పేరుతో ఈ బీమా పాలసీని విడుదల చేసింది. సంప్రదాయ బీమా పద్ధతులకు, ఆధునిక రిస్క్ మేనేజ్‌మెంట్ పరిష్కారాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడమే ఈ పథకం ముఖ్య లక్ష్యమని సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ జోషి వెల్లడించారు.

అందరికీ ప్రయోజనం.. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావానికి గురయ్యే వ్యక్తులు, రైతులు, వ్యాపార, విద్యా/ప్రభుత్వ సంస్థలు, వివిధ వర్గాలకు అన్ని రకాల రక్షణలు కల్పించే ఈ పాలసీ ఎంతో అనుకూలంగా ఉంటుందని జోషి పేర్కొన్నారు. వాతావరణంలో ఆకస్మిక మార్పుల వల్ల నష్టపోయే పాలసీదారులకు సకాలంలో ఆర్థిక సహాయాన్ని అందించి, వారు త్వరగా కోలుకునేలా చేయడానికి ఈ పాలసీని రూపొందించినట్లు వివరించారు.

క్లెయిం చెల్లింపులు ఇలా..

ఈ పారామెట్రిక్ బీమా విధానంలో క్లెయిముల చెల్లింపు ప్రక్రియ అత్యంత వేగంగా జరుగుతుంది. కనీస పత్రాలతో, ఎంతో సులభంగా, పారదర్శకంగా త్వరితగతిన క్లెయిములు పరిష్కారం కావడం ఈ పాలసీ ప్రత్యేకత. ఈ పాలసీ కింద చెల్లింపులు.. వాతావరణాన్ని కొలిచే నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా ఉంటుంది. ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం లాంటి కొలవదగిన అంశాలను బీమా నిబంధనల్లో పేర్కొంటారు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకృతి విపత్తుల తీవ్రత (అతి భారీ వర్షపాతం, తుపాను, భూకంపం వంటివి) ఒప్పందంలో పేర్కొన్న పరిమితికి చేరిన వెంటనే, క్లెయిం మొత్తం నేరుగా అందుతుంది. ఇందులో వాస్తవంగా జరిగిన నష్టంతో సంబంధం లేకుండా, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారమే చెల్లింపులు జరుగుతాయి.

## ఐఫోన్ కొనేందుకు ఇది మంచి సమయం!




అమెజాన్ ప్రైమ్ డే సేల్ సందర్భంగా.. యాపిల్ ఐఫోన్ 16పై భారీ ధర తగ్గింపును ప్రకటించారు. ప్రారంభంలో రూ.79,900 ధరతో విడుదలైన 128+దీ వేరియంట్ ఇప్పుడు రూ.62,900కే అందుబాటులో ఉంది. అంటే వినియోగదారులకు నేరుగా రూ.17,000 వరకు తగ్గింపు లభిస్తోందన్నమాట. అంతేకాకుండా.. అర్హత కలిగిన క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేస్తే అమెజాన్ పే క్యాష్‌బ్యాక్ రూపంలో రూ.3,145 వరకు తిరిగి పొందే అవకాశం ఉంది. దీంతో ఈ ఫోన్ రూ.59,755లకు లభిస్తుంది. ఈ సేల్‌లో అమెజాన్.. ఐఫోన్ 16పై సుమారు 21 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. అదనంగా ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులు, ఎస్‌బీఐ డెబిట్ కార్డులపై రూ.1,750 వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ కూడా లభిస్తుంది. అంతే కాకుండా.. పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్‌చేంజ్ చేస్తే, దాని మోడల్, కండిషన్లను బట్టి గరిష్టంగా రూ.41,050 వరకు ఎక్స్‌చేంజ్ విలువ పొందే అవకాశం ఉంది. దీంతో కొత్త ఐఫోన్‌ను మరింత తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చు. ఈ ఆఫర్‌ను పొందాలంటే అర్హత కలిగిన క్రెడిట్ కార్డుతో కొనుగోలు చేయాలి. క్యాష్‌బ్యాక్ మొత్తం కొనుగోలు పూర్తైన తర్వాత అమెజాన్ పే బ్యాలెన్స్ రూపంలో జమ అవుతుంది. ఒకవేళ వినియోగదారుల వద్ద పాత స్మార్ట్‌ఫోన్ ఉంటే, ఎక్స్‌చేంజ్ ఆఫర్‌ను కూడా కలిపి మరింత ఆదా చేసుకోవచ్చు. అలాగే ఒకేసారి మొత్తం చెల్లించలేని వారు ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై నో-కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఫీచర్ల విషయానికి వస్తే.. ఐఫోన్ 16లో 6.1 అంగుళాల సూపర్ రెటినా XDR OLED డిస్‌ప్లే ఉంటుంది. ఇందులో యాపిల్ ూ18 చిప్‌సెట్ ఉండటంతో వేగవంతమైన పనితీరు లభిస్తుంది. యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లకు కూడా ఈ ఫోన్ సపోర్ట్ చేస్తుంది. ఫోటోగ్రఫీ కోసం 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ మెయిన్ కెమెరా, 12 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ కెమెరా, సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 12 మెగాపిక్సెల్ ట్రూడెప్త్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఇంకా ఈ స్మార్ట్‌ఫోన్ 5+ కనెక్టివిటీ, ఖూదీ టైప్-సీ పోర్ట్, ×ూ68 డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్, మ్యాగ్‌సేఫ్ వైర్‌లెస్ ఛార్జింగ్ వంటి ఆధునిక ఫీచర్లతో వస్తుంది. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్టంగా 22 గంటల వీడియో ప్లేబ్యాక్ అందుతుందని యాపిల్ పేర్కొంది. మొత్తం మీద అమెజాన్ ప్రైమ్ డే సేల్‌లో లభిస్తున్న భారీ తగ్గింపులు, క్యాష్‌బ్యాక్, ఎక్స్‌చేంజ్ ఆఫర్లు, నో-కాస్ట్ ఈఎంఐ వంటి ప్రయోజనాలతో ఐఫోన్ 16 కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశం.

## రూ.6 లక్షల విలువైన బంగారు నెక్లెస్ విరాళం



**శ్రీకాళహస్తి,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విజయవాడ చెందిన అమరేశ్వర రావు ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రాహు కేతు పేరు ప్రఖ్యాతిగాంచిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవి అమ్మవారికి రూ.6 లక్షల 5 వేలు విలువచేసే బంగారు ఆభరణాన్ని విరాళంగా ఆలయ ఈవో బికే వెంకటేశులుకు అందజేశారు. వీరికి ఆలయ అధికారులు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్రపటం తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.




## రాహు కేతు పూజలు నిర్వహించుకున్న శ్రీలంక మాజీ కెప్టెన్



**శ్రీకాళహస్తి, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహు కేతు దోష నివారణ పూజలను శ్రీలంక మాజీ కెప్టెన్ క్రికెటర్ అర్జున రణతుంగ కుటుంబ సభ్యులతో కలసి ఆలయం కు విచ్చేశారు. ఆదివారం సహస్ర లింగం వద్ద రూ.5 వేల ప్రత్యేక రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్థ ప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.

## రౌడీ షీటర్‌పై పీడీ యాక్ట్

**- తిరుమలలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు:జిల్లా ఎస్పీ**



**తిరుమల, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో భక్తుల భద్రత, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ వరుసగా నేరాలకు పాల్పడుతున్న రౌడీ షీటర్ జి.శ్రీనివాసులుపై తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ప్రతిపాదన మేరకు, పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు నిందితుడు తిరుమల ప్రాంతంలో దొంగతనాలు, దాడులు, ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఆయుధాలతో బెదిరింపులు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలకు పాల్పడుతూ గత ఏడాది కాలంలో మొత్తం ఐదు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పలుమార్లు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, అతని నేర ప్రవృత్తిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, ప్రజా శాంతి భద్రతలకు ముప్పుగా మారినట్లు జిల్లా పోలీసు శాఖ నిర్ధారించింది. దీంతో జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వుల మేరకు నిందితుడిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మాట్లాడుతూ, తిరుమలకు విచ్చేసే భక్తుల భద్రత, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీయిజం, దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలతో పాటు, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా నిర్బంధ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి సిటీ, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 6వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.

## నేడు 'డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి'

**తిరుపతి, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జులై 6వ తేదీన ఉదయం 10:00 గం॥ల నుంచి మధ్యాహ్నం 12:30 గం॥ల వరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఏపీఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.

డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గం॥ల వరకు 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చు.తిరుపతి: 8712652679, చిత్తూరు: 7993147979, నెల్లూరు: 08612320427, అన్నమయ్య: 9440817449, కడప: 08562242457, కర్నూలు: 7382614308, నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350 శ్రీసత్యసాయి: 9490615721.

# 17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

**- సాయంత్రం పుష్ప పల్లకిపై విహరించనున్న మలయప్ప**



**తిరుమల,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా జరుగనుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి- ఏప్రిల్ నెలలకు మార్చారు.

**ఉత్సవ విశిష్టత :** ఈ ఉత్సవం రోజున ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు.

**జీయ్యంగార్ల వస్త్ర సమర్పణ :** తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో పరివట్టం (చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోభవ అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్ద జీయ్యర్ స్వామివారికి, చిన్న జీయ్యర్ స్వామివారికి, టీటీడీ తరఫున కార్యనిర్వహణాధికారికి లచ్చన అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు.

హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు.

**పుష్ప పల్లకీపై ఊరేగింపు :** ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

# తిరుపతిలో సెంటర్ ఫర్ లిబర్టీ కార్యాలయం ప్రారంభం

**- 22-ఏ బాధితుల ఆస్తి హక్కుల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం**

**-కార్యాలయాన్ని ప్రారంభించిన సీఎఫ్ఎల్ చైర్మన్ ఏబి.వెంకటేశ్వర రావ్**

**తిరుపతి,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో 22-ఏ జాబితా కారణంగా తమ చట్టబద్ధమైన ఆస్తిలపై హక్కులను వినియోగించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్షలాది మంది భూ యజమానులకు అండగా నిలవాలనే లక్ష్యంతో సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో ఆటంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తొలి "ఆస్తి హక్కుల కేంద్రాన్ని సెంబర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభించారు. స్థానిక ఆంజనేయపురం లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని సెంటర్ ఫర్ లిబర్టీ చైర్మన్ ఏబీ వెంకటేశ్వర్రావు, నలమోతు చక్రవర్తి ప్రారంభించారు. ముందుగా 22-ఏ చట్టంలో లొసుగులను ఎత్తి చూపుతూ నలమోతు చక్రవర్తి వ్రాసిన 'చట్టం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ: అనాదినుంచి వ్యవసాయ దేశమైన భారతదేశంలో రైతుల భూ హక్కులు పరిరక్షింపబడ్డాయని,. వేద కాలం నుంచి గుప్తులు, కుషాణులు, శాత వాహనులు, చోళులు, చాళిక్యులు, ముస్లిం రాజులు, జమీందారులు,బ్రిటిష్ దొరలు రైతుల భూముల మీద ఉన్న హక్కులను ముట్టుకోలేదన్నారు. గత 15 ఏళ్లనుంచి మాత్రమే రాష్ట్రంలో రైతుల హక్కుల హననం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.




భూజాత సీతాదేవిని రావణుడు అపహరించి లంకలో బంధించినట్లు అనాదిగా ఉన్న రైతుల భూహక్కులను రాత్రికి రాత్రి రెవిన్యూ శాఖ వారు అపహరించి 22-ఏ జాబితాలో దాచేసారన్నారు. రావణుడితో రాముడు యుద్ధం చేసి సీతాదేవికి విముక్తి కల్పించినట్లుగా భేషరుతుగా 22-ఏలో ఉన్న భూములను వదలి పెడతారా లేకుంటే తమ ప్రాణ సమానమైన భూములను రక్షించుకోవడానికి యుద్ధం చేయాలా.అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2010 నుంచి నోటీసులు కూడా ఇవ్వకుండా చెరపట్టిన రైతుల భూములకు విముక్తి కల్పించాలని లేదా యుద్ధానికి సిద్ధం కావాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 'ఆస్తి హక్కు ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అని చట్టబద్దంగా సంపాదించిన ఆస్తిని అనుభవించే హక్కును ఏ ప్రభుత్వమూ అన్యాయంగా హరించే అధికారం లేదని ఆయన స్పష్టం చేశారు. నలమోతు చక్రవర్తి మాట్లలడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఆస్తి హక్కుల సంక్షోభంలో ఉందని. 22-ఏ మూలంగా లక్షలాది మంది పౌరులు తమ ఆస్తులు కోల్పోయారన్నారు.అవసరాలకు ఆస్తులు అమ్ముకోలేక నరకయాతన పడుతుంటే, ఎమ్మెల్యేలు, రెవిన్యూ అధికారులు ప్రజలను పీడించుకు తింటున్నారన్నారు. రాష్ట్రంలో 60 శాతం భూములు ప్రభుత్వానివే అని,రాష్ట్రంలో ఏకంగా 1.95 కోట్ల ఎకరాలు 22-ఏ జాబితాలో బందీ అయిందని అంటే రాష్ట్ర భూభాగంలో ఇది దాదాపు 60 శాతంగా ఉందన్నారు. ప్రభుత్వ లెక్కలే ఈ భారీ మోసాన్ని బట్టబయలు చేస్తున్నాయన్నారు. రాష్ఠంలో అసలు దేవాదాయ భూమి సుమారు లక్ష ఎకరాలు ఉంటే, వెబ్‌ల్యాండ్ మాత్రం 8 లక్షల ఎకరాలుగా చూపుతోందని ఆయన విమర్శించారు. వక్ఫ్ భూమి 10వేల ఎకరాలు ఉటంటే, వెబ్‌ల్యాండ్‌లో దాదాప్త లక్ష ఎకరాలుగా నమోదు చేశారన్నారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే డేటా ఎంట్రీలో ఘోరమైన తప్పులు చేసి 22-ఏ జాబితాలో నమోదైన భూముల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మెంది భూ యజమానులు తమ భూములను విక్రయించలేక, కొనుగోలు చేయలేక, రిజిస్ట్రేషన్ చేయిటంచలేక, బాంక్ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శెంగేరి బాబు ఆస్తి హక్కుల కేంద్రం రాయ లసీమ శాఖ అధ్యక్షులు, నరేష్, రాయలసీమ శాఖ కార్యదర్శి, న్యాయవాది సిద్దారెడ్డి, సుబ్బారెడ్డి, మీర య్య, అమూల్ నాయుడు, నాగేశ్వర్రావు, 22-ఏ బాధితులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పురోగతిపై జేసీ సమీక్ష

**తిరుపతి,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లు, వార్డు సచివాలయాలను సందర్శించి, బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటగా మధురానగర్ 7, 8 వార్డు సందర్శించి పోలింగ్ స్టేషన్ నంబర్లు 122, 123, 169, 171, 173, 179లకు చెందిన బీఎల్ఓలతో సమావేశమై ఓటరు జాబితా సవరణ పనుల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం తిరుపతి అర్బన్ నియోజకవర్గంలోని జీవకోన ప్రాంతంలో ఉన్న పోలింగ్ స్టేషన్ నంబర్ 205ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.తదుపరి తిరుమలరెడ్డి నగర్ 1, 2, 3 వార్డు సచివాలయాన్ని సందర్శించి పోలింగ్ స్టేషన్ నంబర్లు 226, 228, 230, 233లకు చెందిన బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడంతో పాటు అనర్హ నమోదులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఆర్ ఐ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి, జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి) శారదా దేవి ఆదివారం తెలిపారు. తిరు పతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూలై 6వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలియజేశారు.అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని కమిషనర్ తెలిపారు.

## రబీ సీజన్‌లో రాగుల సేకరణ విజయవంతం

**- 2,472.750 మెట్రిక్ టన్నుల రాగుల కొనుగోలు**

**- జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**

**పుట్టపర్తి,జూలై 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగుల సేకరణ కార్యక్రమం జిల్లాలోని 12 మండలాల్లో విజయవంతంగా పూర్తయింది. జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రవాణా, చెల్లింపుల ప్రక్రియ అత్యంత సమర్థవంతంగా సాగింది. 2,472.750 మెట్రిక్ టన్నుల రాగులు సేకరించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,015 మంది రైతుల నుండి ఈ కొనుగోళ్లు జరిగాయి.రాగుల సేకరణ ద్వారా రైతులకు సుమారుగా రూ.12.08 కోట్లు చెల్లించడం జరిగింది.మొదట జిల్లాకు 1,500 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యాన్ని కేటాయించారు.రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం అదనంగా మరో 1,010 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని పొడిగించింది.లారీల కొరత, ఇతర ఇబ్బందులు లేకుండా రికార్డు స్థాయిలో 2,472.750 మెట్రిక్ టన్నుల రాగులను సేకరించి లక్ష్యాన్ని చేరుకున్నారు.ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్ రాగుల కొనుగోలు ప్రక్రియ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం జూన్ నెలాఖరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారికంగా మూసివేసినట్లు అధికారులు తెలియజేశారు. గత ఏడాది (2025) సేకరించిన 735 మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ఈసారి జాయింట్ కలెక్టర్ గారి వ్యూహాత్మక పర్యవేక్షణతో ఏకంగా 2,472.750 మెట్రిక్ టన్నుల రాగులను సేకరించారు. ఇది గత ఏడాదితో పోలిస్తే 1,737.750 మెట్రిక్ టన్నులు (దాదాపు 236% పైగా) అధికం.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027